# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 39 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2019

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


శ్రీకృష్ణ కర్ణామృతము ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట........................................ 8

భజ గోవిందమ్ ........................ ....................10

గురు నానక్ ........................ ....................12

రామాయణంలో స్త్రీ పాత్రలు ........................15

రామ భద్రాచార్య ............... ............... ...............18

ధర్మం .... ... ............... ............... ...............19

హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు............20

సత్సంగం ............... ........... ............... ...............21

సంత్ దేవీదాస్ ... .... ..... ... ........................25

సప్తసప్తాహాల సత్సంగ సమావేశాలు - విజ్ఞప్తి 28

ఆశ్రమ ప్రార్థన - ఉపాసన మార్గము.......29

జనక మహారాజు జ్ఞానం ............... ...............31

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................33

కారణ జన్మలు ........................................34

నాగేంద్ర చర్మధర .. ........................ ...............36

కైవల్యోపనిషత్ ... ........................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ........ ........................ ...................41




**పాఠకులకు దసరా శుభాకాంక్షలు**

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 84 వ శ్లో॥**

**ఫుల్లేన్దీవరకాన్తి మిన్దువదన బర్హావతంస ప్రియమ్,**
**శ్రీవత్సాఙ్క ముదార కౌస్తుభ ధర పీతామ్బర సున్దరమ్,**
**గోపీనాం నయనోత్పలార్చిత తనుమ్, గోగోప సఙ్ఘావృతమ్**
**గోవిన్దం కల వేణునాదనిరత దివ్యాఙ్గ భూషం భజే॥**

**తాత్పర్యము -**



వికసించిన నల్లకలువల యొక్క కాంతిగల వాడును, చంద్రుని వంటి మోము కలవాడును, నెమలి పింఛమను శిరోభూషణమే ఇష్టమైనదిగా కలవాడును, శ్రీవత్సమను పుట్టుమచ్చ గలవాడును, గొప్పదియగు కౌస్తుభమను మాణిక్యమును ధరించినవాడును, పచ్చని కలువ కలవాడును, అందమైనవాడును, గోపికల యొక్క నేత్రములనెడి కలువ పువ్వులచేత పూజింపబడిన దేహము గలవాడును, అవ్యక్త మధురమైన వేణునాదమందు ఆసక్తిగలవాడును, సర్వోత్తమములైన అవయవములందలి ఆభరణములు గలవాడును అగు శ్రీకృష్ణుని నేను సేవించుచున్నాను.

1. ఒకే జన్మలో మూడు జన్మలను అనుభించినది ఎవరు?
2. చిన్నప్పుడే చూపు కోల్పోయినా జగద్గురువైన వారెవరు?
3. అప్పుడే పుట్టిన పిల్లవాడు నారదునికి ఏం చెప్పాడు?
4. పెళ్లి అయిన రోజే యోగినిగా మారిన ఆమె ఎవరు?
5. ఆకాశం నుండి అరచేతిలో పండు పడిన విధంగా జ్ఞానం పొందినది ఎవరు?
6. పాండురంగడి నుదుటి మీద బొగ్గుమచ్చ ఎలా పడింది?
7. త్రిగుణాలను అపహరించే దొంగ ఎవరు?
8. గజదొంగను సజ్జనుడిగా మార్చిన పాట ఏది?
9. మూడేళ్ళ వయస్సులోనే కావ్యాలు, పురాణాలు అర్థం చేసుకోగలిన అసాధారణ ప్రజ్ఞావంతుడు ఎవరు?
10. రాముడు తండ్రి మాట విన్నాడా? లేక నిలబెట్టాడా?

***సమాధానాలు లోపలి పేజీలలో ........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

26-2-1980

శ్రీబాబు ఈరోజు ఉదయం భక్తులకు దర్శనం ఇచ్చారు. "భగవంతునియందు విశ్వాసం ఉండాలి. మనం మన వ్యాపారాన్ని, వ్యవసాయాన్ని, దారాపుత్రాదుల్ని, ఆహారాన్ని, తదితర సొంత విషయాలను ప్రేమించినంతగా భగవంతుడిని ప్రేమించలేం. మనకు కావలసినవన్నీ సమకూర్చేది భగవంతుడే అయినప్పటికి, ఆయనను విస్మరించి ఆయన సమకూర్చిన వస్తువులను ప్రేమిస్తాము. అది ఎంత దారుణం?. ఆ వస్తువులకు బదులుగా ఆ పరమాత్ముడిని ప్రేమిస్తే ఆ పరమాత్ముడు మనకు కావలసిన ధనధాన్యాదులు సమకూర్చటమే కాకుండా మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు కదా!



అట్టి భగవానుడిని విస్మరించటం న్యాయమేనా? వివేకి చేయవలసిన పనేనా? చెప్పండి? పరమాత్మునియందు విశ్వాసము ఉంచి ఆయనను సేవించి నట్లయితే మనకి లోటు ఏముంది?" అని ప్రశ్నించి శ్రీ బాబూజీ పురందరదాస్ అనే భక్తుని గురించి చెప్పారు. "పండరీపురంలో పురందరదాస్ అనే భక్తుడు ఉండేవాడు. అతడు పాండురంగడిని కొలిచేవాడు. అతని భార్య గయ్యాళి. వారికి తిండికి గడవటమే కష్టంగా ఉండేది. చాలా దీనస్థితిలో ఉండేవారు. అతని భార్య ప్రతిరోజూ పురందరదాస్‌ని 'ఏమండి మనం భగవంతుడిని ఇంతగా ప్రేమిస్తున్నాం కదా! మనకి ఎందుకు ఈ దీనావస్థ? భగవంతుడు తన భక్తులను రక్షిస్తాడంటారే! ఏదీ మనకు ఏ రకంగా సాయం చేయడేం?' అని నిలదీసి ప్రశ్నిస్తుంది.

పురందరదాస్ ఆమె బాధపడలేక తను కొలిచే పాండురంగడి విగ్రహంపైన బొగ్గుతో ఒక గీత గీస్తాడు. అదేమి విచిత్రమో కాని పండరిపురంలోని దేవాలయంలోని పాండురంగడి విగ్రహంపై ఆ గీత కనబడుతుంది. అదిచూచి పురోహితులంతా ఆశ్చర్యపోతారు. వారు ఎంత

ప్రయత్నం చేసినా స్వామి నొసటపై ఉన్న గీతను పోగొట్టలేకపోతారు. అవును ఆ గీత ఎలా పోతుంది? అది తన భక్తుడు గీసిన గీత. దానిని తుడిచివేయటానికి సామాన్యులకు సాధ్యపడుతుందా?

ఆ దినము పురందరదాస్ పాండురంగడిని సేవించటానికి వెళ్లిన సమయంలో పాండురంగడు మారువేషంలో పురందరదాస్ ఇంటికివచ్చి, నేను నీభర్త పురందరదాస్ స్నేహితుడిని. మీరు దీనావస్థలో ఉన్నారని విని మీకు సహాయం చేయటానికి వచ్చాను. ఇదిగో తీసుకో! అని వారికి కావలసిన వస్తువులన్నింటినీ అందజేస్తాడు.

పురందర్‌దాస్ భార్య సంతోషంతో వాటి నన్నింటినీ స్వీకరించి, భర్త రాకకోసం ఎదురుచూస్తున్నది. భర్త రాగానే 'ఏమండోయ్! మీ స్నేహితుడెవరో మనకు కావలసినవన్నీ ఇచ్చి సహాయం చేశాడు. ఆయన ఎంత తేజోవంతంగా ఉన్నాడనుకున్నారు? ఆయనను చూసిన మనస్సు ఏ ఇతర వస్తువులమీదకు పోదండీ! ఇదేమి విచిత్రమండీ? ఎవరండీ ఆయన? అంతటి మహానుభావుడు. ఆయనలో అంతటి ఆకర్షణకు కారణమేమిటండి? ఆయనను చూసిన దగ్గరనుండి ఆకలిదప్పులు లేవండీ!' అని అంటుంది. ఇది విని పురందరదాస్ 'పాండురంగడు కరుణించాడు' అనుకుంటాడు. 'నువ్వు ఎంత అదృష్టవంతురాలివి? నీ జన్మ సంస్కారం గొప్పది. నేను ఎంతటి భక్తుడనైతేనేమి? ఆ పాండు రంగడిని నీవు కనులారా దర్శించావు. నువ్వు చూసినది ఎవరనుకున్నావు? సాక్షాత్తు ఆ జగన్నాథుడు పాండురంగడు' అంటాడు. ఆ తర్వాత పాండురంగడి నుదుటపై ఉన్న ఆ బొగ్గుగీత అదృశ్య మవుతుంది. అది చూసిన పురోహితుడు ఆశ్చర్యపోతాడు. చూశారా! భగవంతుని యందు పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలి. అదే మనల్ని రక్షిస్తుంది. ఫలితం ఆయనకే వదలాలి. ఆయన ఏది ప్రసాదిస్తే దానిని మనం సంతోషంగా స్వీకరించాలి." అన్నారు శ్రీబాబు.

ఇంతలో అమరా పురుషోత్తంగారు శ్రీ బాబూజీతో మాట్లాడుతూ 'నేను ఒక జ్యోతిష్కుడిని నాభవిష్యత్తు గురించి అడిగాను. నా మృత్యువు దగ్గరలోనే ఉందని చెప్పారు. నేను నా కుటుంబ సమస్యల్ని పూర్తిగా పరిష్కరించుకోలేదు. నాకు చాలా దిగులుగా ఉంది' అని శ్రీ బాబూజీకి విన్నవించారు. పురుషోత్తంగారు శ్రీ బాబూజీ భక్తుడు. శ్రీ బాబూజీ అంటే అత్యంత విశ్వాసం కలవాడు. గురువుయందు అచంచల విశ్వాసం వుంటే అటువంటి శిష్యులపై గురువుకి ప్రేమ, వాత్సల్యం తక్కువగా ఉంటుందా!

పురుషోత్తంగారు చెప్పినది విన్న శ్రీ బాబూజీ మీ ప్రాణానికి వచ్చిన భయం లేదు మీ ఆయుర్దాయాన్ని పొడిగిద్దాం. అసలు ఆయుర్దాయాన్ని వ్రాసేవాడు మనవాడు అయితే దానిని పొడిగించటానికి అభ్యంతరం ఏముంది? భయపడకండి" అని అభయమిచ్చారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ విశ్వాసమే భక్తిగా మారుతుంది. ఆ భక్తి చివరకు తపస్సుగా మారి ఆత్మసందర్శనానికి తోడ్పడుతుంది. భక్తుని మనస్సు ఎప్పుడూ పరమాత్ముని పాదకమలము వద్దనే నిలిచి ఉంటుంది. తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించటానికి శిల్పి, స్వర్ణకారుడు, వజ్రాల వ్యాపారి, భక్తుడు వెళ్ళారు. శిల్పి ఆ స్వామిని చూసి శిల్పసౌందర్యంలోని నైపుణ్యతపై దృష్టిని నిలుపుతాడు. స్వర్ణకారుడు స్వామికి అలంకరించిన నగల నాణ్యత, విలువ అంచనా వేస్తాడు. ఇక వజ్రాల వ్యాపారి ఆయన కిరీటంపైన గల పచ్చ విలువ ఎంత? ఆయన హృదయంపై ఉన్న నీలం విలువ ఎంత? అని అంచనా వేస్తాడు. కాని, భక్తుడు స్వామిని దర్శించటమే కాక, ఆయన పాదకమలములపై మనస్సు లగ్నంచేసి ఆనంద భాష్పాలు రాలుస్తాడు. ఏకాగ్రతని సాధిస్తాడు. మనోలయమై ఆనందాన్ని పొందుతాడు. ఆ ఆనందమూర్తిని తిలకిస్తూ తానే ఆనందమూర్తియై అహం బ్రహ్మాస్మి, లేక ఏకమేవ అద్వితీయ బ్రహ్మగా ప్రకాశిస్తాడు. అటువంటి మహాత్మునికి శిల్పసౌందర్యం, ఆభరణాల విలువ, నాణ్యత, వజ్రాల విలువ కంటికి కనబడతాయా? అటువంటి పరిపూర్ణతను సాధించాలి. అదే అద్వైతం. అది సాధించినపుడే ఈ జన్మ సార్థకమవుతుంది. అట్టి స్థితిని పొందటానికి సద్గురుమూర్తి కృపలేనిదే సాధ్యపడదు. భక్తియోగంలో అర్జునుడు శ్రీకృష్ణపరమాత్ముడిని సగుణ నిర్గుణోపాసకులలో ఎవరు ఉత్తములు? అని ప్రశ్నించాడు. మీ అభిప్రాయం ఏమిటి?" అని శ్రీ బాబూజీ మమ్మల్ని ప్రశ్నించారు.

అంతా మౌనంగా ఉన్నాం.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "సగుణోపాసన ప్రారంభదశ. సమాధి స్థితి పొందిన తర్వాత ఆచరించేదే నిర్గుణోపాసన. మనస్సు పరమాత్మ పరమై ఆత్మానుభూతి పొందేవానికి, పరమాత్మ సగుణ బ్రహ్మ, నిర్గుణ బ్రహ్మ అనే విచక్షణ ఉండదు. అయితే భక్తుని యొక్క స్థితినిబట్టి సగుణబ్రహ్మగా, నిర్గుణ బ్రహ్మగా పరమాత్మ సాక్షాత్కారం అవుతుంది," అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## శాంతి సుఖాలకి నిలయం అమ్మ ఒడి

మనందరం అమ్మ ఒడిలో, అమ్మ ఆలింగనంలో వున్నాం. అమ్మ ఒడిలో హాయి, శాంతి, సుఖాలకి తప్ప వేరే వాటికి తావు లేదు. 'నీ అనురాగమే దేవీ! నీ అనురాగమే నిఖిలావని నిండెనులే'
1) నీ అనురాగపు నిర్మల ధారలు చిగురించెను మా జీవితమంతా నీ అనురాగపు చలువ పందిరలో శాంతి సుఖాలే విరిసెను మాలో ॥నీ॥
2) నీ అనురాగపు విమల కాంతులే ఈ అసహాయుల ఆశాజ్యోతి నీ అనురాగమునిండిన ఇల్లే భోగభాగ్యముల నిలయము తల్లీ' పైకీర్తన గానం చేసి, శ్రీ మాతాజీ తిరిగి యీవిధంగా బోధ కొనసాగించారు. 'జగన్మాత ప్రేమకి మారురూపం. ఆవిడ పరం జ్యోతి స్వరూపిణి. ఆమె ఉన్న చోట కాంతేగాని చీకటికి తావు లేదు. ఆమె జ్ఞాన స్వరూపిణి. సృష్టి, స్థితి, లయాలను క్రమం తప్పకుండా నడిపించే అనంత శక్తి స్వరూపిణి జగన్మాత.



మన హృదయమనే ఇంటి నుండి కామక్రోధాది గుణాలను, ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేని తనములను రహితం చేసుకొని నిర్మలాంతః కరణగా చేసికొంటే ఆవిడ అక్కడ ప్రకాశిస్తుంది. నీ సాధనికి అడ్డువచ్చే గుణాలని త్యాగంచేస్తే, నీ గీత మారుతుంది. అప్పుడు నీకు భగవద్గీత అర్థమవుతుంది. మన జీవితం సత్సంగమనే మధుర రసంలో ఊరిపోవాలి. సత్యవస్తువు కోసం మధనం చేసి, పరిశోధించాలి. ఇది ఏకమే. ఏక వస్తువుని గురించి అనేక మంది, అనేక రకాలుగా మాట్లాడుకుంటున్నాం. ఇటువంటి సత్సంగం జరిగేచోట భేద భావానికి, ఈర్ష్యాసూయలకి తావులేదు. కానీ బయట ప్రపంచములో మాటలాడే మాటల్లో అవి పుష్కలంగా వుంటాయి.

ముందు నీ ఇల్లు (నీ మనస్సు ) శుభ్రం చేసుకోవాలి. భగవన్నామం ద్వారా, భగవత్తత్వ విచారణ ద్వారా, నీ మనస్సుని శుభ్రపరచుకోవాలి. అప్పుడు నీ అంతఃకరణ శుద్ధి అవుతుంది. అట్టి నిర్మలాంతఃకరణలో జగన్మాత దివ్య చరణాలు లాస్య నృత్యం చేస్తాయి.

అట్టి మనసున్న చోట శాంతి సౌఖ్యాలకి కొదవవుంటుందా?

'నిర్మల హృదయ విరాజిత చరణం, సకల చరాచర వ్యాపక చరణం భవసాగర ఉద్ధారక చరణం, శ్రీగురు చరణం ప్రణమామ్యహమ్' ( అని గానం చేసి, శ్రీమాతాజీ తిరిగి ఇలా చెప్పారు).

మన హృదయాలు అలా శుద్ధంగా, నిర్మలంగా, మలరహితంగా ఉన్నాయా అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఎందుకు నిర్మలంగా వుండటంలేదు ? నిర్మల హృదయంలో భాసించేది ఏది? సకలచరాచర సృష్టి అంతా వ్యాపించివున్న ఆ గురుచరణం, భవసాగరం నుండి వుద్ధరించే ఆ దివ్య చరణం, కామక్రోధాది గుణాలు, ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం వంటి గుణాలతో మూసివేయబడిన హృదయంలో ఎలా యిమడగలదు? 'నా ఆరాధ్య దైవమైన నా ప్రభువుని దర్శించాలి, అనుభవించాలి' అని నీవు అనుకుంటే అది ఎక్కడ జరుగుతుంది? అది కేవలం మల రహితమై, నిర్మలమైన, నీ అంతఃకరణలో మాత్రమే సాధ్యం అవుతుంది. కనుక, నీలోనే వున్న నీ ఆరాధ్య దైవాన్ని నువ్వు గుర్తించకుండా చేస్తున్న మల, విక్షేప, ఆవరణ దోషాలని తొలగించుకోవాలి. ఈ మలము అనేది ఇప్పటిది కాదు. అది ఎప్పట్నించో, ఎన్నివేల జన్మల నుంచో నిన్ను ఆవరించి వస్తున్నది. దానిని వదిలించుకోవాలంటే నీవు అశ్రయించిన గురుమూర్తియందు ఆరూఢమైన నమ్మకం వుండాలి. అది జరిగిననాడు నీకు మల దోషం వుండదు. నిరంతరం గురు లక్ష్యార్థ సాధన ద్వారా, భగవన్నామ స్మరణ ద్వారా నీలోని మల దోషం తొలగించుకోవచ్చు. ఇక, విక్షేపదోషం వల్ల నిరంతరం చలించే నీమనస్సును స్వాధీన పరచుకోవాలంటే, అది కేవలం శ్రవణం చేసిన గురు బోధను సదా ఎల్లప్పుడు మననం చేసుకుంటూ, విచారణ చేయాలి. మననం వలన విక్షేపాన్ని వదిలించుకోవాలి. ఆపైన నిన్ను ఆవరించి వున్న ఆవరణ దోషాన్ని, అంటే 'దేహం నేను' అనే భావాన్ని కేవలం గురుమూర్తి మాత్రమే తొలగించగలరు. పై రెండూ (అంటే మల, విక్షేపాలు) నీ పురుష ప్రయత్నంతో నీవు చేస్తే, మూడవ దానిని పరమ పురుషుడైన శ్రీ గురుదేవులు తొలగిస్తారు.

అట్టి అనంత శక్తి స్వరూపుడైన గురుదేవులు మనలని అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్య ములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి, సర్వదా రక్షించు గాక, సుఖీభవ! సుఖీభవ !!

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

# భజ  గోవిన్దమ్

***3. నారీ స్తనభర నాభీదేశం***
***దృష్ట్వా మా గా మోహావేశమ్ ।***
***ఏతన్మాంస వసాది వికారం***
***మనసి విచింతయ వారమ్ వారమ్ ॥***

రెండవ శ్లోకంలో కాంచనం మీద దృష్టి పోగొట్టుకొమ్మని చెప్పి, ఈ శ్లోకంలో స్త్రీవ్యామోహం విడవమని శ్రీశంకరులు చెబుతున్నారు. అన్ని జీవులు శాంతి సౌఖ్యాలతో వుండాలని చూస్తాయి. అంటే దుఃఖాలపై విముఖత, సుఖాలపై మోజు చూపుతాయి. ధనం ఉంటే సుఖాలు పొందవచ్చని మానవుడు అభిప్రాయపడతాడు. అందుకని ధన సంపాదనకై ఆరాటపడతాడు. కాని ధనికుడికి సుఖం ఎక్కడిది? ముందు ఆ ధనాన్ని దొంగల బారినుండి కాపాడటానికి అనేక తంటాలు పడతాడు. ధనంతో వచ్చే సుఖాలు శాశ్వతమా? ఒక కోరిక తీరితే ఇంకొక కోరిక పుట్టుకొస్తుంది. ధనం పై మోజు పెరిగి, ఆ తరువాత స్త్రీలపై వ్యామోహం పెరుగుతుంది. స్త్రీ పురుషునిపై వ్యామోహపడినా, పురుషుడు స్త్రీపై వ్యామోహపడినా మిగిలేది దుఃఖమే. ఈ వ్యామోహాన్ని ప్రయత్నం ద్వారా మానవులే తొలగించుకోగలరు. జంతువులు చేయలేవు. సాధన ద్వారా, సంయమనం ద్వారా విషయాలపై విముఖత పొందవచ్చు. అది ఎలా అంటే, విషయాలపైనుండి దృష్టిని తత్త్వ విచారణపై నిలపాలి. దీనినే ప్రతిపక్ష భావన అంటారు. స్త్రీ వక్షోజములు, నాభీ దేశము చూసి మానవుడు ఆకర్షింపబడతాడు. శ్రీ శంకరులు అంటున్నారు - ఓ మానవా! ఆలోచించు! ఈ అంగాలు మాంసము, క్రొవ్వుతోకూడి చర్మంతో కప్పబడినవి. ఈ విధంగా విచారణ చెయ్యి. అప్పుడు మనస్సు దానిపై విముఖత చూపిస్తుంది . ఇదే ప్రతిపక్ష భావన.

మొదటి శ్లోకంలో కాలం వ్యర్థం చేయకుండా దేవుని స్మరించమని, రెండు, మూడు శ్లోకాలలో కామినీ కాంచనాలపైన మోహం వదులుకొమ్మని శ్రీ శంకరులు ఉద్బోధిస్తున్నారు. ధనం మీద వ్యామోహం 'మా'- వద్దు అని, కామినీ కాంచనానికి 'గాః' - ఎర అవకు అని

చెబుతున్నారు. వీటిపైన వ్యామోహం పోతే మనస్సు చలించదు. ఒకవేళ చలిస్తే వివేక దృష్టి ద్వారా మనస్సును నియంత్రణలోకి తెచ్చుకోవచ్చు. దీనికి క్రమశిక్షణ, పవిత్రత, నిగ్రహం చాలా అవసరం. అదే మనిషికి జంతువుకి తేడా తెలిపే గీటురాయి.

- సశేషం



హైదరాబాద్‌శాఖ వార్షిక సత్సంగ సమావేశాల సదర్భంగా కర్తలచేత శ్రీసద్గురు పాదపూజ చేయిస్తున్న శ్రీ మాతాజీ

## పెదనిండ్రక్రొలను శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2019

5 శని - మూలా నక్షత్రం - సరస్వతీపూజ.

6 ఆది - దుర్గాష్టమి

7 సోమ - మహర్నవమి

8 మంగళ - విజయదశమి

13 ఆది - ఆశ్వీయుజ పౌర్ణమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురుపాదపూజ

23 బుధ - శ్రీగురుదశమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురుపాదపూజ.

26 శని - నరక చతుర్దశి

27 ఆది - దీపావళి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురు పాదపూజ

**నవంబర్ 2019**

12 మంగళ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

21 గురు - శ్రీగురుదశమి. శ్రీబాబూజీ ఆరాధన. శ్రీసద్గురుపాదపూజ.

(గత సంచిక తరువాయి) 

# గురు నానక్

- వెంకటస్వామి

నానక్ తన శిష్యుడైన మర్దానాతో కలసి, పంజాబ్ నైరుతీ ప్రాంతంలో సంచరిస్తుండగా, త్రోవలో సజ్జనుడు అనే గజ దొంగ ఎదురయ్యాడు. వాడు కాషాయాంబరాలు ధరించి, రుద్రాక్షలు, విభూతిరేఖలు ధరించి, కపట సన్న్యాసి వేషంలో తిరుగుతూ, దారినపోయేవారు ఏ మతస్థులైనా సరే, వారిని సాదరంగా ఆహ్వానించి, సేవచేసి, రాత్రిపూట పంచభక్ష్య పరమాన్నాలతో వారికి భోజనం పెట్టి, సంతృప్తి పరచి, ఆ బాటసారి నిద్రపోగానే, అతని దగ్గర సొమ్ము వగైరా తస్కరించి, అతని గొంతు పిసికి చంపేసి, ప్రక్కనే వున్న పాడుబడిన బావిలో పడవేసి, మరల తిరిగి ఉదయాన్నే యథా ప్రకారంగా ఎవరు వస్తారా? అని బాటసారుల కోసం ఎదురుచూసేవాడు.

ఒకరోజు నానక్ తన శిష్యసమేతంగా ఆ త్రోవలోనే రావటం తటస్థించింది. వారిని చూసిన సజ్జనుడు తన అనుయాయులతో వారు బాగా సంపన్నుల్లాగా కనబడతున్నారు, వారికి సకల మర్యాదలు చేయవలసింది అని చెప్పాడు. అలాగే చేశారు. రాత్రి పొద్దుపోయాక సజ్జనుడు నానక్‌ను, శిష్యులను విశ్రాంతి తీసుకోవలసినదిగా ప్రార్థించాడు. అప్పుడు నానక్ ఒక్క పాట పాడి ఆ తరువాత నిద్రపోతాము అని చెప్పాడు.

మర్దానా మహీ రాగంలో శృతిని మనోహరంగా వాయించగా, నానక్ పాట పాడుతున్నాడు. సజ్జనుడు తన అనుచరులతో కలసి అక్కడ కూర్చుని పాట వింటున్నాడు. ఆ పాట భావము ఇలా ఉంది - 'కంచుపాత్ర తోమగా తోమగా దాని మురికి పోయి అది మెరుస్తుంది. బంధుమిత్రులమని చెప్పుకొనేవారు, భగవత్సన్నిధిలో లెక్కలు తేల్చుకునే రోజున ఈ మిత్రులు మనలను సమర్థించని పక్షంలో వారిని మిత్రులుగా తలచుటెట్లు? పాడు బడిన దేవాలయమునకు బయట అలంకారములు ఎన్ని చేసినప్పటికినీ ప్రయోజనము సున్న. తమాలవృక్షము దేనికీ పనికిరాని విధంగా మానవుడు తన జీవితమును వృథా చేసుకొనరాదు. అంధుడు గమ్యాన్ని చేరలేడు' - ఈ పాట విని, సజ్జనుడు తన గత జీవితాన్ని తలచుకుని, పశ్చాత్తాపపడి, నానక్ కాళ్ళపై పడి, యదార్థమంతా చెప్పి, తన గత జీవితం గురించి తెలియజేసి, క్షమార్పణ కోరుకుని, తనను

శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించాడు. నానక్ అతను గత జీవితంలో ఆర్జించిన సొమ్మంతా తెప్పించి, బీదసాదలకు దానధర్మాలను చేయించి, సజ్జనుడిని తన ప్రధాన శిష్యునిగా స్వీకరించాడు.

సూఫీ మత గురువు నానక్‌ను ముండనం ఎందుకు చేయించుకోలేదు? సంసారి వేషం ఎందుకు వేశావు? అని అడిగాడు. దానికి నానక్ సమాధానంగా 'ముండనం కావలసినది మనస్సుగాని, శిరస్సుకాదు. విషయ విముఖుడవటవే మనస్సుకు నిజమైన ముండనము. ప్రతివారు భోగలాలసత్వము, అరిషడ్వర్గము, త్రిగుణములను వదలి, దైవము ఎదుట తల వంచవలెను. అప్పుడు అతడు ఎట్టి దుస్తులు ధరించినను అవి పరమ పవిత్రములే అవుతాయి' అని చెప్పాడు.

నానక్ మర్దానా సమేతంగా పర్యటిస్తూ అనేక అద్భుతాలను చూపిస్తూ, బౌద్ధులను, జైనులను వారివారి వాదములలో ఓడిస్తూ, పంజాబ్ మధ్యప్రాంతములో గల సయ్యద్‌పూర్ అనే గ్రామం చేరుకున్నాడు. అక్కడ తన శిష్యుని ఇంట్లో బస చేశాడు. అక్కడ పఠానుల పరిపాలన చాలా కష్టతరముగా వుండేది. పంజాబ్‌లో ఘోర యుద్ధం అనంతరం, బాబర్ సింహాసనం ఎక్కి ప్రజల బాధలు పోగొడతాడని సూచించాడు.

ఆ విధంగానే ఢిల్లీ సింహాసనమును బాబర్ హస్తగతం చేసుకుని, అక్కడి వారితోపాటు నానక్‌ను కూడా ఖైదీలో పెట్టాడు బాబర్. నానక్ పరమసంతోషంతో ఖైదులో ఆత్మానందంలో ఓలలాడుతున్నాడు. కొంతకాలానికి బాబర్ నానక్ విషయాన్ని తెలుసుకుని, ఆయనను విడిపించి, తన వద్దకు పిలిపించుకుని, క్షమార్పణ కోరుకున్నాడు. ప్రజలపై నిరంకుశత్వం చలాయించకుండా, ఇక నుండి వారిని కన్నబిడ్డల వలె పాలిస్తానని నానక్‌కు మాట ఇచ్చాడు బాబర్. నానక్ ఆదేశం ప్రకారం యుద్ధ ఖైదీలందరినీ కూడా బాబర్ విడిచిపెట్టాడు.

ఒకరోజు నానక్ తన శిష్యులను పరీక్షించదలచి, కిరాతక వేషం ధరించి, చేతిలో కత్తి, వేటకుక్కలను మదిరాపాత్రను పట్టుకుని అరణ్యంలో ప్రవేశించాడు. ఈ వేషం చూసి భయపడి కొంతమంది శిష్యులు ముందే పారిపోయారు. దారి మధ్యలో రాగి కాసులు చూసి మరి కొంతమంది అవి ఏరుకుంటూ అక్కడే వుండిపోయారు, మరి కొంత దూరం వెళ్ళాక దారిలో బంగారు కాసులు కనిపించాయి, ఇంకొంతమంది శిష్యులు ఆశతో వాటిని ఏరుకుంటూ అక్కడే

వుండిపోయారు. నానక్ అలాగే ముందుకు సాగిపోతున్నాడు. ఇద్దరు శిక్కులు, మరియు లెహ్నా అనే శిష్యుడు మాత్రం ఇంకా తమ గురువుని అనుసరిస్తూ వెంట వచ్చారు. మరి కొంత దూరం నడిచాక అక్కడ దుర్గంధ భూయిష్ఠమైన, కుళ్ళిపోయిన శవం ఒకటి కనిపించింది. నానక్ తన వెంట వస్తున్న ఆ ముగ్గురుని కళ్ళెర్ర చేసి చూస్తూ, 'నా వెంట రాదలచినచో ఆ శవమాంసం తినవలసినదే' అని ఆజ్ఞాపించాడు.

ఆ మాటలు విని ఆ శిక్కులిద్దరూ పలాయనం చిత్తగించారు. లెహ్నా మటుకు ఆయన ఆజ్ఞ ప్రకారం ఆ శవమాంసం తినడానికి ఉపక్రమించాడు. అప్పుడు నానక్ అతనిని ఆపి, ప్రేమతో దగ్గరకు తీసుకుని, అతని మార్గాన్ని ఎంతమంది అనుసరించగలరో సత్యంగా అని తెలుసుకోవడానికి ఆ పరీక్ష పెట్టాను అని చెప్పాడు. తన తరువాత లెహ్నాను గురువుగా ప్రకటించి, గురునానక్ భగవంతునిలో ఐక్యం అయిపోయాడు.

గురునానక్ మరణానంతరం అతని శరీరం దహనం చేయలా? లేక ఖననం చేయాలా? అని హిందూ ముస్లీం శిష్యులకు వాదన రాగా, ఆయన శరీరంపై కప్పిన వస్త్రం మీద పూలు చల్లి, ఏ వర్గం వారి పూలు వాడిపోతే, ఆ శరీరం రెండవ వర్గం వారికి చెందినదిగా నిర్ణయించారు. కాని తెల్లవారే సరికి పై వస్త్రం తొలగించగా అసలు అక్కడ శరీరమే మాయమైంది. అప్పుడు ఆ వస్త్రాన్ని చెరి సగం చేసి, ఎవరి ఇష్టాను సారంగా వారు దహన ఖననములు జరిపించుకున్నారు.

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

# రామాయణంలో స్త్రీ పాత్రలు

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## కైక

ఆమె కైకేయ రాజు పుత్రిక గనుక కైక (కైకేయి)గా ప్రసిద్ధి చెందినది. కైక దశరథ మహారాజుగారి ముద్దుల భార్య. ఆమె మహా సౌందర్యవతి, విద్యావంతురాలు. యుద్ధములో కూడా కైకేయి కడు ప్రజ్ఞావంతురాలు. ఆమెను అత్యంత మురిపెంగా చూసుకునేవాడు భర్త. అందుచేత ఆమెకు అహంభావం కూడా. కైకేయి క్రియాశక్తికి ప్రతీక. కథా పరంగా కైకేయి చాల కీలక పాత్రను పోషించింది. కైక వరాలు కోరకుండా వుండి వుంటే, రాముడు వన వాసానికి వెళ్ళేవాడు కాదు. సీతమ్మ అరణ్యానికి వెళ్ళడం, సీతాపహరణం, రావణ వధ జరిగి వుండేవి కావు. ప్రతి విషయంలోనూ కైక ఆడింది ఆట, పాడింది పాటగా వుండేది.

బాల రాముని సౌందర్యాన్ని చూసి, ముగ్ధురాలై, చిన్నారి రామన్న ఆలనా, పాలనా ముద్దు ముచ్చట్లు అన్ని చూస్తూ, రతనాల మువ్వలతో టుమకు, టుమకు మని రఘుకుల దీపకుడు తప్పటడుగులు వేస్తూ, చిరు మువ్వల సందడితో, చిరుదరహాసంతో, సర్వులనూ పరవశింప జేస్తుంటే, యీ భాగ్యము తనదే సుమా అని గర్విస్తూ, చిన్నారి రాముని క్రిందకు దించేది కాదు. తన వొడిలోనే పొదివి పట్టుకుని, ముద్దు మురిపాలు చూస్తూ గడిపేది పినతల్లియైన కైకమ్మ.

ఆమె పుట్టింటి నుండి అరణంగా తెచ్చుకున్న దాసదాసీ జనంలో ప్రముఖురాలు మంథర. ఆ మంథరే కైక జీవితాన్ని చిందరవందరగా చేసింది. ఎంతో ఆనందంగా పాల మీగడలా వున్న ఆమె జీవితంలో మంథర విష బిందువులను చిమ్మింది. శ్రీరామచంద్రుని పట్టాభిషేకం వార్త వినగానే, మంథర భగ్గు భగ్గుమని మండిపోతూ, అసూయతో వుడికిపోయి, కుపితురాలైంది. మంథర రూపమే వికృతం కాకుండా, బుద్ధి కూడా వక్రమైనది, వికృత మైనది. కైకకు మంథర పుట్టింటి నుండి వచ్చిన వరంకాదు, శాపం. వికార రూపానికితోడు, వికృతమైన ఆలోచనలతో రుసరుస లాడుతూ, కైకమ్మ రాజప్రాసాదంలోకి ప్రవేశించింది మంథర. ఆమెను చూడగానే 'నీ కోపానికి కారణం

ఏమిటి?' అని ప్రశ్నించింది కైకేయి. వెంటనే మంథర 'కొంపలు మునిగిపోయే విషయం జరుగుతుంటే, నీవు నిమ్మకు నెరెత్తినట్లు ఎలా కూర్చున్నావ'ని ప్రశ్నించింది. వెంటనే 'కైకమ్మ అసలు విషయం చెప్పకుండా నన్ను విసిగించ వద్దు' అన్నది. అప్పుడు మంథర 'శ్రీరామునికి పట్టాభిషేకం నిశ్చయమైనది. అయోధ్య అంతా ఆనందోత్సాహాలతో కోలాహలంగా వుంది' అని చెప్పి, ఆగింది.

అప్పుడు కైకేయి 'ఇంతటి శుభప్రదమైన, పరమానందకరమైన విషయాన్ని చెప్పడానికి, కొంపలు మునిగి పోయినట్లు అపభ్రంశం మాటలు మాట్లాడకు మంథరా' అని మందలించింది. కైకేయి అహంభావియే కాని, సహజంగా చెడ్డది కాదు. ఆమెకు శ్రీరామచంద్రుని పట్ల అపారమైన పుత్రవాత్సల్యము. భరతుని కన్న బాల రామునే మిన్నగా చూసేది. కాని దుస్సాంగత్య ప్రభావం ఎంత విషతుల్యమో మంథర ద్వారా మనకు విదితమవుతుంది. వెంటనే మంథర కోపంతో అణువణువూ కంపిస్తూ, 'మూర్ఖురాలా! నీవెంతటి ఉపద్రవానికి లోనవుతున్నావో తెలుసుకో లేకపోతున్నావు. శ్రీరామచంద్రునకు సామ్రాజ్య పట్టాభిషేకం కాగానే, కౌసల్య రాజమాతగా ఎలా విర్రవీగుతుందో ఆలోచించుకో. నీ వైభవమంతా నేలపాలయినట్లే. ఇహ కౌసల్య రాజమాతగా నిన్ను కాలబెట్టి నేలరాస్తుంది' అన్నది. ఆ మాటలు వినగానే, కైకమ్మ మనస్స కీకారణ్యమైనది. పాలవంటి స్వచ్ఛమైన మనస్సు విషతుల్యమై, వికృతంగా మారిపోయింది. మంథర అంటే మనస్సు మాయ అని అర్థము. మాయకు దాసోహమన్న కైక మనస్సు విషతుల్యమై ఆపాదమస్తకం గరళంగా మారింది. మంథర సలహానే శిరోధార్యంగా భావించింది. అదే ఆమె పతనానికి నాంది పలికింది.

పూర్వము దశరథ మహారాజు దేవాసుర సంగ్రామంలో శంభరాసురునితో యుద్ధం చేస్తున్నప్పుడు, క్లిష్ట పరిస్థితులలో చిక్కుకున్నాడు. అప్పుడు యుద్ధకౌశల్యం గల కైక ఎంతో ప్రావీణ్యంతో రథ సారథ్యం చేసి, రెండుసార్లు పతిదేవుని ప్రాణాలు కాపాడింది. అబ్బురపరచే కైకేయి ప్రతిభకు, ధీరత్వమునకు ముగ్ధుడై, మహారాజు రెండు వరాలు కోరుకోమన్నాడు. అప్పుడు కైకేయి ఆలోచించి. భవిష్యత్తులో తనకు అవసరమైనప్పుడు కోరుకుంటానని చెప్పింది. దుష్టురాలు,

క్రూరురాలు అయిన మంధర ఈ సందర్భంలో కైకమ్మకు ఆ విషయాన్ని స్ఫురణకు తెచ్చింది. అది వుపయోగించుకోవడానికి ఇదే అనువైన సమయం అని చెప్పింది. రామునికి పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం, భరతునికి పట్టాభిషేకం రెండు వరాలుగా కోరుకోమని సలహా ఇచ్చింది.

విషానికైనా విరుగుడు వుంటుందేమో గాని, దుర్జన సాంగత్యం విషానికన్నా, కడు నీచమైనదని మంధర నిరూపించింది. సజ్జన సాంగత్యం ఆయుర్వేద ఔషధంలాగా నిదానంగా పనిచేసి, రోగ నివారణ చేస్తుంది. కాని, దుర్జన సాంగత్యం నరాలలోకి ఎక్కించే సూది మందులాగా, పాదరసంలాగా వెంటనే దుష్ఫలితాన్నిస్తుంది. మంధర మంతనాలతో కైకేయి మనస్సు వికలమై, మురికి గుంటలాగా దుర్గంధ పూరితమైనది. తన పథకాన్ని అమలు పెట్టడానికి కోపగృహంలోకి ప్రవేశించింది.

వృద్ధుడైన దశరథ మహారాజు తన మురిపాల, ముద్దుల సతీమణిని ప్రసన్నం చేసుకోవడానికి, ఆమె కోప గృహంలోకి చేరి, ఆమెను బుజ్జగిస్తూ, ఆమెకు ఏ వరాలు కావాలో కోరుకోమన్నాడు. కోరిన వరాలు తప్పక నెరవేరుస్తానని శపథం చేశాడు. వెంటనే ఆమె ఆ రెండు వరాలు కోరింది. కైక కోరిన వరాలు అశనిపాతమై, దశరథ మహారాజు దిక్కులేని పరిస్థితిలో కుప్పకూలినట్లు, నేలమీదపడి దొర్లుతూ విలపిస్తాడు. దుష్టురాలైన మంధర మాటలకు దాసోహమని, కైక కోరిన రెండు వరాలు శాపాలై ఆమె శేష జీవితమును అంధకార బంధురం చేసింది. వైధవ్యాన్ని కోరి తెచ్చుకున్నట్లయింది.

పుత్రుని ఆగ్రహానికి గురి అయింది. ఏ కుమారుని భవిష్యత్తుని బంగారుబాటగా చేయాలని ఆ వరాలు కోరిందో, ఆ తనయుడు భరతుడే ఆమె పాపానికి నిష్కృతి లేదని, అటువంటి తల్లి గర్భవాసాన జన్మించడం తన దురదృష్టమని దూషించాడు. జీవిత పర్యంతమూ తన భర్త మరణానికి తానే కారణమని ఆమె అంతరాత్మ ఘోషిస్తూనే వున్నది. పుత్రుని ప్రేమ కూడా కరువైంది. ఆమె జీవితం స్త్రీ జాతికంతటికీ ఒక గుణపాఠం నేర్పిస్తుంది. దుర్జన సాగంత్యం దూలకొండి ఆకు కంటే హీనం కనుక దానికి దూరంగా వుండాలి. వారి నీడలో కూడా చరించకూడదు అనే పరమ సత్యాన్ని కైక జీవితం బోధిస్తోంది.

# రామభద్రాచార్య

- మురళీ

శ్రీ జగద్గురు రామభద్రాచార్య ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, జోన్‌పూర్ జిల్లా, సందికుర్తి గ్రామంలో జనవరి14, 1950లో మకర సంక్రాంతి శుభ ఘడియలలో జన్మించగా, ఆ బాలునికి గిరిధర్ అని నామకరణం చేశారు. ఆ గ్రామంలో సంభవించిన కంటి జబ్బువలన, సరియైన వైద్యసదుపాయం లేనందున, రెండు నెలల వయస్సులోనే గిరిధర్ కంటిచూపు శాశ్వతంగా పోయింది. అప్పటి నుండి వారికి బాహ్యదృష్టి లేకపోయినా, ఏక సంథాగ్రాహి అయినందున ఒక్కసారి వినగానే ఆమూలాగ్రంగా గ్రహించి తిరిగి చెప్పగలిగేవారు. 5సం. వయస్సునాటికి భగవద్గీత (సంస్కృతం), 8సం. వయస్సు నాటికి తులసీదాసు రామచరితమానస్ (10800శ్లో॥) కంఠోపాఠంగా చెప్పగలిగేవారు. అనంతర కాలంలో సంస్కృత వ్యాకరణం, వేదాలు, ఉపనిషత్తులు, భాగవత పురాణం, తులసీదాసు రచించిన అన్ని గ్రంథాలు పూర్తిగా చెప్పగలిగారు. జీవితంలో ఒక వికలాంగుడిగా ఆయన పడ్డ అష్టకష్టాలను దృష్టిలో వుంచుకుని, వికలాంగులకు ఉన్నత విద్యా ప్రదానం చేయాలనే సంకల్పంతో చిత్రకూట్‌లో 'శ్రీ రామభద్రాచార్య వికలాంగుల విశ్వవిద్యాలయము' 2009లో స్థాపించి, అతి తక్కువ ఫీజులతో నడిపిస్తున్నారు.

2003 వ సం॥లో అలహాబాద్ హైకోర్టులో జరిగిన రామజన్మభూమి వివాదంలో సాక్ష్యమిస్తూ వాల్మీకి రామాయణము, రామతాపన్యోపనిషత్, స్కందపురాణం, యజుర్వేదం, అధర్వణవేదాలలోగల ఆధారాలను, రామచరిత మానసలో గల ఆధారాలను, రామజన్మభూమి సరిహద్దులతో పోల్చి చూపి, న్యాయస్థానానికి తగు నిర్ణయం తీసుకోవడానికి సహాయపడ్డారు. శ్రీరామభద్రాచార్య స్వామి రామచరిత మానసను సుమారు 4000 సార్లు పారాయణ చేశారు. రామచరిత మానస పైన గత 400 సంవత్సరాలలో అనేక ముద్రణలు ప్రచారంలో వున్నాయి. వీటిలో సుమారు 50 గ్రంథాలు సరిచూసి భక్తులకు ప్రసాదించారు. మన కాలంలో ఇంతటి ఋషి, వ్యాఖ్యాత, కవి, ఆదర్శమూర్తి, నాయకుడు, ప్రసంగి, సంగీత విద్వాంసుడు, విద్యావేత్త, సంఘసంస్కర్త, వికలాంగులకు ఆదర్శమూర్తి వేరొకరు లేనేలేరు. శ్రీ జగద్గురు రామభద్రాచార్య స్వామి వారి గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే. వారి జీవితమే ఒక గ్రంథం. అది అందరికీ ఆదర్శనీయం.

# ధర్మం

- పాలూరి ప్రసాద్

'రాముడు తండ్రి మాటను విన్నాడు. కనుకే దేవుడు అయ్యాడు. నా మాట వినకపోతే నాశనం అయిపోతావు' అని చాలామంది తండ్రులు తమ బిడ్డలను బెదిరిస్తూ వుంటారు. అయితే ఇక్కడ రాముడు చేసింది తండ్రి మాట వినడం కాదు, తండ్రి మాట నిలబెట్టడం. ఈ రెండిటికి తేడా ఏమిటో చూద్దాం.

ఒక తండ్రి లక్ష రూపాయలు అప్పు చేశాడనుకోండి. ఇచ్చినవాడు ఇంటికి వస్తే, తన కొడుకును పిలిచి 'నేను లేనని చెప్పు. ఒకవేళ అప్పు గురించి అడిగితే నీకు సంబంధం లేదని చెప్పు' అన్నాడనుకోండి. ఇప్పుడు ఆ కొడుకు ఆ తండ్రిమాట వినడం అంటే ఆయన చెప్పిన అబద్ధాన్ని అక్షరాలా పాటించడం. అదే తండ్రి మాట నిలబెట్టడం అంటే, తన తండ్రి అప్పు తీసుకునేటప్పుడు ఇచ్చిన మాటకు కట్టుబడి, తానైనా ఆ అప్పును తిరిగి చెల్లించడం. ఇందులో ఏది నిజమైన పుత్ర ధర్మం?

రాముడు ధర్మ స్వరూపుడు. (రామో విగ్రహవాన్ ధర్మః) కాబట్టి తన నిజమైన పుత్ర ధర్మాన్నే పాటించాడు. రాముడు నిజంగా తన తండ్రి మాట విని వుంటే, మనకు రామాయణం వచ్చేది కాదు. దశరథుడు 'నన్ను చంపి అయినా సరే నీ రాజ్యాన్ని నువ్వు తీసుకో. అంతేకాని, నన్ను వదలి నువ్వు అరణ్యానికి వెళ్ళడానికి వీలులేదు' అని ఎంతగానో ప్రాధేయపడ్డాడు. అయినా రాముడు తన తండ్రి తన పినతల్లికిచ్చిన మాటను నిలబెట్టడానికి ఆ తండ్రి మాటనే పెడచెవిని పెట్టి మరీ అడవులకు పయనమయ్యాడు. అప్పుడు దశరథుని మాట విని సుమంతుడు రథాన్ని ఆపబోతే, రాముడు ముందుకు పోనీయమన్నాడు. 'రాజాజ్ఞను పాటించకపోతే రేపు నేను ఆయనకు ఏమని సమాధానం చెప్పాలి?' అని సుమంతుడు ప్రశ్నించినప్పుడు, 'రథచక్రాల చప్పుడులో మీ మీటలు వినబడ లేదని చెప్పు' అని చెప్పాడు.

తానిచ్చిన మాటకోసం భార్యాపుత్రులను చివరికి తనను తాను కూడా అమ్ముకొని, దాస్యం చేసి, అందులో భాగంగా తన భార్యకే మరణ శిక్ష అమలుచేయవలసి వచ్చినా కూడా వెనక్కి తగ్గలేదు హరిశ్చంద్రుడు. అలాగే ఇక్ష్వాకువంశంలోని రాజులందరూ ధర్మానికి కట్టుబడి, ఎన్ని

కష్టాలైనా ఎదుర్కొన్నారు కాని, ధర్మాన్ని మాత్రం వీడలేదు. అయితే దశరథుని దగ్గరకు వచ్చేసరికి ఆయనకు రాముడు ఒక బలహీనతగా మారాడు. 'మీరేది అడిగితే అది ఇస్తాన'ని, విశ్వామిత్రునికి మాట ఇచ్చి కూడా తీరా రాముని తనతో పంపమనగానే మాట తప్పడానికి సిద్ధపడ్డాడు. అలాగే కైకకిచ్చిన మాట విషయంలో కూడా రాముని కోసం మాట తప్పబోయాడు. అందుకే తన వంశ గౌరవం నిలబెట్టి తండ్రిని ధర్మచ్యుతుని కాకుండా కాపాడటం కోసం రాముడు ఆ తండ్రి మాటనే పెడచెవిని పెట్టవలసి వచ్చింది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2019**

6 ఆది - దుర్గాష్టమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ.

7 సోమ - మహర్నవమి -

8 మంగళ - విజయదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

13 ఆది - ఆశ్వీయుజ పౌర్ణమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

23 బుధ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

26 శని - నరక చతుర్దశి

27 ఆది - అమావాస్య - దీపావళి - ఉదయం 11గం. శ్రీసద్గురు పాదపూజ

**నవంబర్ 2019**

8 శుక్ర - చిలుక ఏకాదశి (కార్తీక శుద్ధ ఏకాదశి)

9 శని - క్షీరాబ్ది ద్వాదశి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

12 మంగళ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

21 గురు - శ్రీగురుదశమి. శ్రీబాబూజీ ఆరాధన. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.


సత్సంగం
మధుప
తాతగారూ! సత్సంగం గొప్పతనం ఏమిటో దయచేసి వివరించరా?
అదిగో ఆ పెంటకుప్పపై ఇప్పుడే పుట్టిన పురుగును అడుగు మనవడా!
1


సత్సంగం గొప్పతనం ఏమిటో దయచేసి వివరిస్తావా?
2


నేను అడగగానే ఆ పురుగు చనిపోయింది స్వామీ!
అది సరేగానీ ఇప్పుడే పుట్టిన ఆ ఆవుదూడని అడిగి రా నారదా!
3


సత్సంగం గొప్పతనం ఏమిటో దయచేసి వివరిస్తావా?
4


నేను అడగగానే ఆ ఆవుదూడ కూడా చనిపోయింది తాతగారూ!
పరవాలేదులే, ఇప్పుడే పుట్టిన ఆ రాకుమారుడిని అడుగు నారదా!
5


నేను ఈ ప్రశ్న అడగగానే ఆ పురుగూ, ఆవుదూడా కూడా వెంటనే చనిపోయాయి. ఇప్పుడు ఈ రాకుమారుడికి ఏమైనా అయితే నా గతి ఏమిటి?
ఏమైనా తాతగారి ఆజ్ఞ పాటించక తప్పదు కదా!
6


సత్సంగం
గొప్పతనం ఏమిటో
దయచేసి
వివరిస్తావా?
7


ముందు పురుగుగా పుట్టిన నాకు
వెంటనే తమ సాంగత్యంతో
పవిత్రమైన ఆవు జన్మ వచ్చింది
స్వామీ! మళ్ళీ వెంటనే తమ దర్శనం
కలగటంతో ఇప్పుడే ఉత్తమమైన
మానవజన్మ లభించింది. ఇంతకంటే
సత్సంగం గొప్పతనానికి నిదర్శనం
ఏముంటుంది?
8

(గత సంచిక తరువాయి)

# సంత్ దేవీదాస్

- రావి. శోభ

దేవలుడు ఆ మరునాడే ఇంట్లో కనిపించలేదు. తల్లి ఆరాటంతో నలుదిక్కులా వెదికితే కొండమీద ఒక బండరాతి మీద ధ్యాననిమగ్నుడై కనిపించాడు. 'సాధు వాక్యం నిజం చేస్తావా నాయనా! నన్ను వదలి వెళ్ళకురా!' అన్నది రాణీబాయి. కాని దేవలుడు 'అమ్మా! భోలానాధుని నుదుట విభూదినై శాశ్వతంగా ప్రకాశించేవాడనమ్మా! నన్ను ఆశీర్వదించు తల్లీ!' అని తల వంచాడు. దీవించక తప్పలేదు ఆ తల్లికి.

సాధువైన అతడు దేవీదాసుగా లోక సంచారం ప్రారంభించాడు. ఆర్తులకి అతడు కల్పవృక్షం. అందుకే ఒకనాడు అతనికి గోచరించిన దృశ్యం నిలువునా కదిలించివేసింది. అది ఏమంటే, ఆ గ్రామంలో ఒక వ్యక్తి వున్నాడు. అతని తల్లికి కుష్ఠువ్యాధి సోకింది. దేవాలయం అర్చకునితో సహా ఊరివారంతా ఆ వ్యాధికి జడిసి, ఆ దాపులకు పోవడం మానేయడమే కాక, అటువంటి ఆమెను గంగలో పడవేస్తే అందరికీ శ్రేయస్సు కలుగుతుందని ఆ వ్యక్తికి అదే పనిగా బోధించారు. అందరి క్షేమం ఆశించి, బలవంతంగా బాధపడుతూనే, అటువంటి కిరాత చర్యకు పూనుకున్నాడు అతడు. ఊరంతా ఊరేగింపుగా బయలుదేరివెళ్ళి , ఆ తల్లిని నీటిపాలు కావలసినదిగా వత్తిడి చేశారు. అందరి బాధా భరించలేక ఆ తల్లి వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంటూ నీటిలో దూకేసింది.

భయంకరమైన ఆ దృశ్యాన్ని చూసి కంపించిపోయాడు దేవీదాసు. నీటిలోకి దూకి ఆమెను రక్షించి, ఒడ్డుకు చేర్చాడు. కాని గట్టుమీద వున్న వారంతా అది చూసి సహించలేక ఆ పని హానికరం అంటూ ఆ తల్లిని, అతనిని కూడా రాళ్ళతో కొట్టారు. ఊరిలోకి రావద్దన్నారు. 'నేటి నుండి ఈమె నాకు తల్లి. నేను నా కుటీరానికి తీసుకుని వెళ్ళి సేవచేస్తాను. మానవ సేవయే మాధవ సేవ' అని అందరికీ బోధించాడు.

మహనీయులైన వారి వ్యక్తిత్వాన్ని వారిలోని దైవత్వాన్ని గుర్తించేందుకు బాహ్యదృష్టి చాలదు. జ్ఞానదృష్టి కావాలి. అటువంటి జ్ఞానదృష్టి ఎవరో సంస్కారవంతులకు గాని లభ్యమవదు. అటువంటి అర్హతకు పాత్రురాలైనది అమీర్‌బాయి. ఆమె ఒక చక్కని చుక్క. వివాహమై అత్తవారింట అడుగు పెట్టిన తొలిరోజునే దైవ సన్నిధికి వచ్చిన ఆమెకి

దేవీదాసు దర్శనం లభించింది. జ్ఞానబోధ చేస్తున్న ఆ సద్గురుమూర్తి బోధ వింటూ బ్రహ్మానందభరితురాలై తన్మయత్వంతో నిలబడిపోయిన అమీర్‌బాయిని ఇంటికి తీసుకు వెళ్ళేందుకు ఆమె భర్త వచ్చాడు. అమీరబాయిని చూశాడు. రోగపీడితురాలైన వారికి ఉపచారాలు చేస్తున్న దేవీదాసు మహాత్మ్యం గుర్తించక అక్కడున్న వికార రూపులైన కుష్ఠురోగులుని చూశాడు, 'నువ్వు అసలే సౌందర్యవతివి. ఈ చాయలలో ఎక్కువసేపు వుంటే నీకూ ఆ రోగం అంటుకుంటుంది. త్వరగా యింటికి పద'మన్నాడు. ఆమె చిరునవ్వుతో 'నా సౌందర్యాన్ని ప్రేమిస్తున్నారా? లేక నన్నా? ఇంత అందగత్తెను పొగుడుతున్న మీరు నాకు ఆ రోగం అంటుకున్నప్పుడు దగ్గరకి చేరి నన్ను అభిమానించగలరా? ఆ అందం ఎప్పుడూ నిలిచేది కాదు. అశాశ్వతమైనది. బాహ్యదృష్టితో కాక, ఆత్మ సౌందర్యాన్ని చూడగలిగినవాడే ధన్యుడు' అని చెప్పింది.

గృహస్థ జీవితంలో అడుగుపెట్టిన మొదటిరోజునే ఆమె భర్త అనేక విధాల నచ్చజెప్పాలని చూశాడు. కాని సంసార జీవితంలో పెట్టవలసిన అడుగుని, ఆధ్యాత్మిక పథంలోకి పెడుతూ ఆమె తన ఆభరణాలన్నీ తీసి భర్త చేతిలో పెట్టింది. 'యోగినివైపోతావా?' అన్న అతని వాక్యాన్ని ఆ క్షణంలోనే అమలుపరచింది. ఆ విధంగా నవ వధువు అయిన అమీర్‌బాయి సంసార బంధం నుంచి విడివడి సరాసరి వెళ్ళి దేవీదాసు దగ్గర మోకరిల్లింది. అతడు భర్తని, కాపురాన్ని వదలుకోవద్దని, తిరిగి ఇంటికి వెళ్ళమని హెచ్చరించాడు. అయితే 'మీరాబాయిని ఆమె గురుదేవుడు ఇలాగే బంధనలోకి వెళ్ళమన్నారా?' అని అమీర్‌బాయి ఎదురు ప్రశ్న వేసింది. సంస్కారవంతమైన మనస్సు కలిగిన ఆమె మాటని కాదనలేకపోయాడు దేవీదాసు. 'నేటి నుండి నువ్వు నా కుమార్తెవు. నేను నీకు తండ్రిని. యోగినివైన నీవు ఇల్లిల్లూ తిరిగి బిచ్చమడిగి తెమ్మ'ని జోలెయిచ్చి పంపించాడు. నిశ్చల చిత్తంతో పరమానందంతో అందుకున్నదామె. నాటి నుండి సద్గురు నామాన్ని స్మరించి భిక్షమడుగుతున్న ఆమెని ఊరివారంతా హేళన చేశారు. మీరాబాయిలాగ యోగిని అయిందన్నారు. ఎవరేమన్నా లెక్కలేదామెకు. ఊరంతా ఆమెకి ఆమె భర్తకి శత్రువులు అయ్యారు. అనారోగ్యంతో ఆఖరి క్షణాలేమోననిపించే బిడ్డనెత్తుకుని ఒక తల్లి గుడిలోకి వెళ్ళి దైవాన్ని దర్శించి తన బిడ్డని బ్రతికించమని ప్రార్థించుకుంటాననంటే అర్చకుడు

గుడి తలుపులు తీయలేదు.

ఆ సమయంలో అమీర్‌బాయి అక్కడకి వచ్చి, ఆ బిడ్డను ఎత్తుకుని సద్గురు నామాన్ని స్మరిస్తూ మురళీధరుణ్ణి ప్రార్థిస్తే తలుపులు విడిపోయి, వేణుగాన లోలుని దర్శనమవడమే కాక, స్వామి మెడలోని పుష్పమాల బిడ్డకు రక్షణ కవచంగా చుట్టుకుంది. దేవీదాసు, అమీర్‌బాయి కలసి వుంటే సహించలేని ఓర్వలేని కొంతమంది సంశయిస్తుంటే, దేవీదాసు తన శిష్యుడైన శార్దూలభగత్‌ని, అమీర్‌బాయిని ఇద్దరినీ రెండు అస్థిపంజరాలుగా చేసి, ఇందులో ఏది ఆడ? ఏది మగ? చెప్పగలరా? అని ప్రశ్నిస్తే అందరూ తలలు వంచుకున్నారు. 'నేను వచ్చిన పని అయిపోయింది. సమాధిలో ప్రవేశిస్తున్నాను' అని దేవీదాసు అనగానే అందరూ దుఃఖితులయ్యారు. యోగులను, సాధకులను అందరినీ పిలిపించి అదొక ఉత్సవంలాగా తాను సమాధి స్థితుడయ్యాడు. అయితే ఎంతమంది కలసి ఎంత మట్టిపోసినా ఆ సమాధి నిండటం లేదు. అప్పుడు అమీర్‌బాయి ఏదాఅని చూస్తే, ఆమె గురునామస్మరణలో మునిగి వుంది. అంతా ఆమె దగ్గరకు వెళ్ళి జరిగినది చెబితే, ఆమె తక్షణమే ఒక మట్టి కుప్పగా మారిపోయింది, ఆ మట్టి తీసుకువెళ్ళి సమాధిలో పోస్తే సమాధి నిండిపోయింది.

గురుశిష్యుల సంబంధం అంత గొప్పదని, శిష్యునికి గురువు మీద గల విశ్వాసం ఎంతటి ఘనకార్యమైనా అవలీలగ నెరవేర్చగలదని అనుక్షణం శిష్యుణ్ణి అమితవాత్సల్యంతో కాపాడుతున్న సమర్థ సద్గురు దేవీదాసు, అమీర్‌బాయి చరిత్ర చాటుతోంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు, అయిన తేలప్రోలు రామనారాయణ (క్యాంటిన్ శెట్టి)గారు 1-9-2019 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 83 సంవత్సరాలు. శ్రీసద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; *2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు చాళుక్య కుమారారామం, శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి, సామర్లకోట;* 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ద్రాక్షారామం ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, ఉమాసోమేశ్వర జనార్ధనస్వామివార్ల దేవస్థానం భీమవరం; 5. ది.17.09.2019 నుండి ది.24.09.2019 వరకు క్షీరారామం, శ్రీ పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, పాలకొల్లు; ***6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, శ్రీ బాలా చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం అమరావతి;*** మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;
కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు
కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# ఆశ్రమ ప్రార్థన – ఉపాసన మార్గము

ప్రార్థనానంతరం శ్రీ నారాయణ ప్రసాద్‌గారు, బాబూజీ బోధ చదివిన తరువాత శ్రీమాతాజీ మాట్లాడుతూ: "ఈ రోజు గురుదేవులు ఏమని శెలవిచ్చారు? 'గురుసాన్నిధ్యాన్ని వదలరాదు. వారికి చతుర్విధ శుశ్రూషలు చేసుకోవాలి. అప్పుడే మనస్సు లొంగుతుంది. చతర్విధ శుశ్రూషలు అంటే గురుదేవుని కాళ్ళు విరగగొట్టటం కాదు. వారు మీ భోగ భాగ్యాలు ఆశించరు. నిజమైన భక్తుడు ఎప్పుడూ గురుపాదాన్ని ఆశ్రయించి ఉంటాడు. సంస్కారం ఉన్నవారు ఎన్నడైనా ఆ పాదాలని విడిచిపెడతాడా?అతనికి ఏ విధమైన లోటు ఉంటుందా? విశ్వాసం అన్నింటికి ముఖ్యం' అని చెప్పారు.

శ్రీగురుదేవులు మనని రెండుపూటలా ప్రార్థన చేయమన్నారు. అది తప్పక చేయాలి. ప్రార్థన మనస్సు పెట్టి చేయాలి. "ఓం" అనగానే మనస్సు శ్రీగురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థంపై నిలవాలి. "ఓం" అన్న తరువాత "గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః..." శ్లోకం చదువుతాం. అంతః కరణ శాంతి చెందేందుకు -"సత్యం, శాంతి, దయ, ప్రేమ" అని, ఆ తరువాత మనకు గురుదేవులు ప్రసాదించిన మహామంత్రాలు: - "హరేరామ హరేరామ రామరామ హరే హరే। హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే" ; ''ఓం నమఃశివాయ''(పంచాక్షరి);''ఓం నమో నారాయణాయ"(అష్టాక్షరి); "ఓం తత్సత్ పరమేశ్వరీ"; "ఓం శ్రీం రాం"; "ఓం కృష్ణాయ" అనే మంత్రాలతో మౌన ధ్యానం చేస్తాం. వీటిలో నీ ఇష్టదైవం ఎవరో ఆ మంత్రాన్ని అనుష్ఠానంలో పెట్టుకో. మౌనధ్యానంలో ఆ మంత్రం మీద నీ మనస్సును ఏకాగ్రం చెయ్యి.

మౌన ధ్యానం అయి తరువాత హారతులు వస్తాయి. హారతి సమయంలో శ్రీగురుదేవుల దివ్య మంగళ మూర్తిని కనులారా దర్శించు. భగవతత్త్వం తెలియజేసే ఉపనిషత్తులను ప్రార్థనలో పెట్టారు. భగవంతుని నిర్గుణ తత్త్వాన్ని తెలియజేసే - "చిదానందరూప శివోహం శివోహం"- అని "చిదానందాష్టకం" చదువుతాం. "మాం శరణం గచ్ఛామి" అంటూ ప్రార్థన ముగిస్తాం. జాగ్రత్తగా ఆలోచిస్తే శ్రీ గురుదేవులు ప్రార్థనలో ఉపాసనా మార్గాన్ని ఇమిడ్చారన్నది తేట తెల్లమవుతుంది.

ప్రార్థన అయిన తరువాత మనం శ్రీ గురుదేవులు ప్రసాదించిన సేవలు - ధ్యాన సేవ; పూజ సేవ; తదితర ఆశ్రమ సేవలలో నిమగ్న మవుతాం. ఏ సేవ చేస్తున్నా మన మనస్సును లక్ష్యార్థం పై ఉంచి చేయాలి. లక్ష్యమూర్తి సాక్షాత్కారం కొరకు ఆవేదన చెందాలి. గురూపదిష్ట మార్గంలో నడుస్తూ గురు ఆజ్ఞా పాలన చేయాలి.

ఈ విధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకొని సాయంత్రం ప్రార్థన ముగిసిన తరువాత శ్రీ పరాశర ప్రసాద్ వారు గ్రంథస్థం చేసి ఉంచిన "శ్రీ బాబూజీ స్మృతుల"నుండి శ్రీనారాయణ ప్రసాద్ వారు మనకు ప్రతిరోజూ వినిపించే శ్రీబాబూజీ దివ్య బోధని శ్రద్ధగా వినాలి, ఆ విన్నదానిని మననం చేయాలి. మననం చేసినదానిని ఆచరణలో పెట్టాలి. ఎవరినీ విమర్శించ వద్దు.

శ్రీ గురుదేవులు మనని చూస్తున్నారు; మనచేత సేవలు చేయిస్తున్నారు; శ్రీగురుదేవులే మనను నడిపిస్తున్నారు - అనే గాఢ విశ్వాసం కలిగి ఉండాలి. అప్పుడు శ్రీగురుదేవులు మన యోగంతో కూడిన క్షేమాల భారం స్వయంగా వహిస్తారు. ఇందులో సందేహం లేదు. కాబట్టి  మనందరికీ అట్టి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించమని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాను.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, అక్టోబర్, నవంబర్ 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***అక్టోబర్ 2019 :*** AS 5708, 6102, 6152, 6336, 6444, 6575, 6867, 6932, 7379, 7377, 7683, 7684, 7896, 7898, 7899, 7900, 7901, 7902, 7904, 7906, 7907, 7909, 7910, 7912, 7913, 7914, 7915, 7916, 7917, 7918, 7919.

***నవంబర్ 2019 :*** AS 4887, 6765, 6790, 6971, 7367, 7450, 7609, 7921, 7927 - 7931, 7947 - 7950, 7952

# జనక మహారాజు జ్ఞానం

- గాలి జగదీశ్

వశిష్ఠునిచేత మోక్షపథము రెండు విధాలుగా చెప్పబడింది. మొదటిది - ఆచార్యునిచే నిర్దేశింపబడిన సన్మార్గం. సద్గురుదేవుని బోధను క్షుణ్ణంగా అర్థంచేసుకుని, ఆచరించిన సాధకుడు తన మోహాన్ని క్రమేపీ జయిస్తూ ఈ జన్మలోనే లేదా వచ్చేజన్మలోనైనా సరే తప్పక తరిస్తాడు. ఇహ రెండవది - అతి పక్వుడయిన అభ్యాసకుని స్వచ్ఛమైన మనస్సులో ఆత్మజ్ఞానం స్వయంగా స్ఫురించడం చేత, తన అంతరాత్మచేత ప్రబోధితుడై, తనంతట తానే తరిస్తాడు. ఈ సందర్భంలో ఆకాశం నుంచి అరచేతిలో పండు పడిన విధంగా జ్ఞానం లభించిన జనకమహారాజు కథను తెలుసుకుందాము.

సుసంపన్నమైన మిథిలానగరానికి రాజైన జనకమహారాజు అజాత శత్రువు. ప్రజలందరినీ కన్నబిడ్డలవలే పాలించేవాడు. ప్రజలందరూ కూడా రాగద్వేషాలు లేనివారై, నిత్యసంతుష్టులై, నిర్భయులై పరమ ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నారు.

ఒకరోజు జనకమహారాజు తన ఉద్యానవనంలో విహరిస్తూ, ఒక చలువరాతిపై కూర్చుని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, అరమోడ్పు కన్నులతో, ప్రశాంత చిత్తంతో ధ్యాననిమగ్నుడై వుండగా, ఆకాశంలో విహరిస్తున్న సిద్ధులు ఆలపించే జ్ఞానపరమైన గంధర్వగానము అతని హృదయాన్ని కదిలించివేసింది. ఆత్మజ్ఞానపరమైన ఆ పదములు విన్న జనకమహారాజు మంత్రముచేత స్తంభించిపోయిన సర్పము మాదిరిగా అయిపోయాడు. కొంతసేపటికి తేరుకుని తన అంతఃపురానికి వెళ్ళి, తనలో తానే ఇలా విచారణ చేసుకున్నాడు.

ఈ సిద్ధులు పలికిన వాక్యములెంత సత్యము! మూర్ఖుడనై నేను ఆచరించే ఈ కార్యకలాపమంతా ఏమిటి? నాకు పట్టబోయే గతి ఏమిటి? మహారాజునని భావిస్తూ అడవిలోని గుడ్డివానిలాగ ప్రవర్తిస్తున్నాను. అనంత కాలంతో పోలిస్తే నా ఆయువు నూరు సంవత్సరాలు ఒక్క క్షణం కూడా కాదు. ఎందరు నా కంటే గొప్పవారు కాల గర్భంలో కలిసిపోలేదు? విశాలమైన ఈ విశ్వంలో సూది మొనంత కూడాలేని నా రాజ్యమును చూసి నేను మురిసిపోవటం ఎంత వింత?

అసంఖ్యాకమైన ఇలాంటి రాజ్యాలెన్నో కాలంలో మట్టిదిబ్బలైపోయాయి. ఎప్పటికీ కాలపురుషుడిదే అంతిమ విజయంగా తోస్తోంది. అతడికి శత్రువు, మిత్రువు, తనవారు, పరాయివారు అనేవి లేవు. అందరినీ సమంగా కొంచెం ముందు వెనుకలలో తన పొట్టన పెట్టుకుంటాడు. మరణమే పరమ సత్యం అయినప్పుడు ఇక నట్టనడిమి నాటకమంతా దేనికి? ఎవరిని అలరించడానికి? నా ఈ మనస్సే నా వశంలో లేదు. నిద్రలో, స్వప్నంలో అదృశ్యమవడమో, వేషం మార్చడమో చేస్తూ మరణంతో మటుమాయం అవుతోంది కదా! ఇక దీని మాట పట్టుకుని రకరకాల పనులకు దిగడం అన్నది మొసలి సహాయంతో నదిని దాటినట్లే.

ఇంతకీ ఈ మనసంటే ఏమిటి? సంకల్పవికల్పాలే కదా. అది చెయ్యాలి, ఇది చెయ్యవద్దు, దీనిని సాధించాలి. అనే తలపే నా చేత ఈ పనులన్నిటినీ చేయిస్తోంది, తప్పటడుగులు వేయిస్తోంది. కాబట్టి ఈ సంకల్పాలను విరగ్గొడతాను. మనసనేదే లేకుండా పోతుంది. హమ్మయ్య! ఇంతకాలానికి నన్ను దోచుకుంటున్న ఈ మనస్సనే దొంగను పట్టుకున్నాను. వాడిని (ఈ మనసుని) ఇహ అంతం చేస్తాను.

ఇలా నిశ్చయాత్మకుడై మౌనం వహించగానే, ఆ మహితాత్ముని హృదయం సహస్రాధిక దళాలతో వికసించింది. అతని మనస్సు హృదయంలో తన ఉనికిని కోల్పోయింది. గాఢ సమాధిస్థితి అతనిని ఆవహించింది. అలా రాత్రంతా సమాధిస్థితిని అనుభవించిన ఆ పుణ్యచరితుడు ఉదయ కిరణాల స్పర్శతో కన్నులు తెరిచి ఇలా చర్చించుకున్నాడు 'గాలి మేడలాంటి ఈ లోకంతో నాకేమి పని? సాధించవలసినదాన్ని సాధించుకున్నాను. సిద్ధమయ్యే వున్నవాడిని కాబట్టి ఇక నేను పొందవలసినదేమున్నది? ప్రపంచంలో కనబడేది, కనిపించనిది కూడా స్వచ్ఛమైన జ్ఞానమే. నా స్వరూపమే. నాకు అందరానిదానికోసం తపించను. ఈశ్వరుడు నాకు ప్రసాదించిన దానిని ద్వేషించను. సుఖమైనా, దుఃఖమైనా ఎప్పటికీ నా స్వభావాన్ని విడనాడను. జరిగేది జరుగుతుంది. జరగనిది జరుగదు' అని శుద్ధ మనస్కుడైన ఆ జనకమహారాజు అద్వితీయమైన ఆత్మనిష్ఠలో ఆరూఢుడైనాడు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2019**

5 శని - మూలా నక్షత్రం - సరస్వతీపూజ

6 ఆది - దుర్గాష్టమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

7 సోమ - మహర్నవమి

8 మంగళ - విజయదశమి. శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు. నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు జరుగును.

9 బుధ - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, అక్షతలు, జగన్మాత నగరోత్సవం, రాత్రి 7-30ని॥లకు శ్రీ సద్గురుపాదపూజ.

13 ఆది - ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం. శ్రీ సద్గురుదీక్ష ప్రారంభం.

23 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

26 శని - నరక చతుర్దశి - మాసశివరాత్రి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

27 ఆది - అమావాస్య - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

31 గురు - నాగుల చవితి. కార్తీక శుద్ధ చవితి నుండి నవంబర్ 8 శుక్ర - వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామివారికి పంచామృతములు, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్షబిల్వార్చన.

**నవంబర్ 2019**

8 శుక్ర - చిలుక ఏకాదశి - శ్రీసద్గురు పాదపూజ. ఏకాహం సంకీర్తన. సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలు. భక్తసమారాధన.

9 శని - క్షీరాబ్ధి ద్వాదశి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

12 మంగళ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. జ్వాలాతోరణం, నగరోత్సవం.

15 శుక్ర నుండి 21 గురు వరకు శ్రీ సద్గురుదేవుల ఆరాధనా మహోత్సవాలు.

21 గురు - శ్రీగురుదశమి.

22 శుక్ర - శ్రీసద్గురుదేవుల మహాభిషేకము. శ్రీ సద్గురు మండల దీక్షలో పాల్గొన్నవారికి హోమం.

23 శని - హోమం పూర్ణాహుతి, దీక్షా విరమణ.

25 సోమ - మాసశివరాత్రి

26 మంగళ - అమావాస్య.

# కారణ జన్ములు

- సుభాషిణి

శ్రీనివాస్ అనే వ్యక్తి నారాయణ పురంలో వుండేవాడు. కానీ అతనికి 'నారాయణ' అనే పేరు ఉచ్చరించడం కూడా చిరాకు కలిగించే విషయం. ఊరిలోని ప్రతి ఒక్కరితో 'దేవుడు లేడు' అని వాదన చేస్తూ వుండేవాడు. తనతో వాదించలేక ఈ మనిషికి ఎలాగైనా మనుషులు వాళ్ళ విలువలు, పుట్టుక దానికి కారణం తెలుసుకునేలా చేద్దామని తన ఇంటి ముందు వుండే పేదరైతు సదాశివం అనుకున్నాడు.

ఆ ఊరికి ఒక స్వామీజీ వచ్చారు. ఆయన మాట్లాడుతున్న మాటలు, ముఖంలో తేజస్సు అన్నీ చాలా హాయిగా అనిపించింది ఆ సదాశివానికి. ఒకసారి ఆ ఊరివారంతా స్వామీజీ ప్రవచనానికి రావడం జరిగింది. శ్రీనివాస్‌తో సహా అందరూ అక్కడే వున్నారు. సదాశివం స్వామీజీకి దగ్గరగా వెళ్ళి, 'స్వామీ! ఇక్కడ వున్నవాళ్ళల్లో బాగా తెలివైనవాడు శ్రీనివాస్. అతనికి ఒక సందేహాన్ని తీరుస్తారా?' అని అడిగాడు. దానికి ఆ స్వామీజీ సరే అని రమ్మనమన్నట్లుగా సైగ చేశారు. 'ఇదేదో తనకి మంచి అవకాశమని, తనకున్న తెలివితేటలతో సభలోని వారందరనీ ఆశ్చర్యచకితులను చేయాలనుకున్నాడు శ్రీనివాస్.

'స్వామీ! ప్రతి పుట్టుకకు ఒక కారణం వుంటుంది కదా! మరి కొంతమందిని మాత్రమే 'కారణజన్ములు' అని ఎందుకు అంటారు? అని శ్రీనివాస్ ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు సమాధానం అతనికి నోటితో చెప్పాలనిపించలేదు. స్వయంగా ఆ వ్యక్తికి తెలిసేలాగా చేయాలనుకున్నాడు. అందుకని 'నాయనా! నీవు నా నుండి దీనికి సమాధానం తెలుసుకోవాలంటే ముందు కొంత కష్టపడవలసి వుంది. మరి దానికి సిద్ధమయితే చెప్పు' అన్నారు స్పష్టంగా.

ఊరి అందరి ముందు ఒక స్వామీజీని ప్రశ్నించాను అనే గర్వంతో వున్న శ్రీనివాస్‌కి అదేమీ పెద్ద కష్టమనిపించలేదు. పైగా ఈ అవకాశం వల్ల ఊరిలో అందరికీ కూడా తాను తెలివైన వాడినని తెలుస్తుంది. అప్పుడు నన్ను వాదనలో ఎవరూ ఓడించలేరు అని లోలోన మురిసిపోతూ 'తప్పక మీరు చెప్పిన పని నేను చేస్తాను' అన్నాడు శ్రీనివాస్.

'నాయనా! నువ్వు ఇక్కడకి నాలుగు మైళ్ళ దూరంలో వున్న తోటలోకి వెళ్ళి, అక్కడ వున్న చెట్టు ప్రక్కనే మరొక చెట్టునాటి, పెరిగి వున్న చెట్టుపైన పక్షులకు ఆహారం సమకూర్చి రావాలి. అలా 40 రోజులు

క్రమం తప్పకుండా చేశాక తిరిగి వచ్చి నన్ను కలుసుకో. అప్పుడు నీకు తప్పక నీ ప్రశ్నకు సమాధానం చెబుతాను' అన్నారు. శ్రీనివాస్ 'అలాగే. తప్పక మీరు చెప్పింది పాటించి మీ దగ్గరకు వస్తాను' అని వెళ్ళిపోయాడు.

శ్రీనివాస్ స్వామీజీ చెప్పినట్లుగానే చెట్టునాటి, ప్రక్కనే వున్న చెట్టు మీద తాటాకు బుట్టలలో రకరకాల ధాన్యం గింజలు వేసిపెట్టి, రోజు వచ్చి ఆ చెట్లకు నీరు పోసేవాడు. పక్షులు కొన్ని ఆ చెట్టుపైనే గూళ్ళు కట్టుకుని, ఆ బుట్టలోని ధాన్యాలు తింటూ కిలకిలమంటూ హాయిగా జీవించసాగాయి. ఇలా నలభై రోజులు గడిచిపోయింది.

స్వామీజీ ప్రవచనం చేసే సమయానికి శ్రీనివాస్ అక్కడకి వెళ్ళి, అందరూ వెళ్ళిపోయాక ఒంటరిగా స్వామీజీని కలుసుకుని, 'మీరు చెప్పినట్లే చేశాను. తమరిక ఇప్పుడైనా నా ప్రశ్నకు సమాధానం చెబుతారా?' అని అడిగాడు.

శ్రీనివాస్‌లో వచ్చిన మార్పును గమనించిన స్వామీజీ అతనివైపే చూస్తూ 'రేపు ఈ సమయానికల్లా నీవు చనిపోతావు!' అని చెప్పారు. అది విని శ్రీనివాస్ నిలువునా కుప్పకూలిపోయాడు. కాస్త తేరుకున్నాక, 'అదేమిటి స్వామీ! నేను చెట్లను నాటి, బోలెడు పక్షులకు ఆహారం సమకూర్చి, గూటిలో అవి కిలకిలమంటూ హాయిగా వుండేలాగా చేశాను. మంచిపని చేశాను కదా! మరి నేను ఎందుకు మరణిస్తాను? అవేవీ నన్ను రక్షించవా?' అని అడిగాడు.

దానికి స్వామీజీ చిరునవ్వుతో 'నాయనా! నీవు గత జన్మలో పక్షులను వేటాడి చంపి అవి తింటూ బ్రతికావు. వాటిని బాధపెట్టావు. కాబట్టి నీకు ఈ జన్మ వచ్చింది. ఇలా నీవు 60సంవత్సరాలు బ్రతక వలసి వుంది. కానీ నాలాంటి కారణ జన్ముల సన్నిధికి రావటం వలన నీ గత జన్మ తాలూకు చేసిన కర్మను పాపాన్ని నశింపజేసే మార్గం చెప్పాను. దాని వలన నీకు ఇప్పుడే విముక్తి కలుగుతోంది' అని చెప్పాడు.

అప్పుడు శ్రీనివాస్‌కి అర్థం అయింది. సంతోషంతో నారాయణ నారాయణ అని పాటలు కూడా పాడి పరవశించిపోయాడు. ఆ మరునాడే అతనికి ముక్తి విముక్తి కూడా కలిగాయి. కారణజన్ములు పుట్టిన ప్రతివానికి వారికి తగిన మార్గాన్ని నిర్దేశించి, దానిని ఆచరించడం ద్వారా ముక్తిని ప్రసాదించడానికి వచ్చిన మహానుభావులు! అట్టివారే సమర్థ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్! మరియు శ్రీమాతాజీ!

# నాగేంద్ర చర్మధర

- మధుప

శివ కవచంలో పరమేశ్వరుని 'నాగేంద్ర చర్మధర' అనే నామంతో సంబోధిస్తారు. అయితే ఇక్కడ మన వాడుక భాషలో వున్నట్లు, నాగేంద్ర అంటే పాము కాదు. ఈ నామంలో నాగేంద్ర అంటే గజరాజు. తనకు ఎలాగో మరణం తప్పదని తెలుసుకున్న గజాసురుడు, 'నా శిరస్సు లోక పూజ్యం చేసి, నా చర్మాన్ని నీవు ధరించు' అని పరమేశ్వరుడిని ప్రార్థిస్తాడు. తదనుగుణంగానే పరమేశ్వరుడు ఆ గజాసురుడి ముఖాన్ని ప్రథమపూజ్యుడైన గణపతికి అమర్చి, రక్తమోడుతున్న ఆ గజ చర్మాన్ని తాను ధరించాడు.

పరమేశ్వరుడి ఆహార్యాన్ని చూస్తే, వంటి నిండా చితాభస్మం, ఆభరణాలుగా సర్పాలు, వస్త్రంగా గజచర్మం ... ఇలా మనకు కలలోనైనా ఊహించడానికి భయపడే, జుగుప్స కలగే విధంగా వుంటుంది. అయితే మరి ఇవన్నీ ఆయనకు ఎలా ప్రీతిపాత్రమయ్యాయి? 'యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి । సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥' అని ఈశావాస్యోపనిషత్ చెబుతోంది. - సర్వభూతములను తన యందు, సర్వభూతముల యందు తనను నిత్యం దర్శించి, అనుభూతి చెందేవానికి ఈ సృష్టిలోని ఏ వస్తువూ జుగుప్స కలిగించదు. అలాంటి విశ్వజనీనమైన ప్రేమతత్త్వం, సర్వాత్మ తత్వమే శివతత్వం. అదే మనకు ఈ 'నాగేంద్ర చర్మధర' అనే నామం సూచిస్తోంది.

ఇక గజరాజుకి నాగేంద్ర అనే సంబోధన మనకు భాగవతంలో కూడా వస్తుంది. పైగా ఇది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్రాసుకున్న పద్యభాగం. గజేంద్రమోక్ష ఘట్టంలో పోతనగారు 'అలవైకుంఠ పురంబులో నగరిలో ఆమూల సౌధంబు దాపల' వరకూ వ్రాసి, ఆ తరువాత వైకుంఠంలో ఏముందో ఆయన ఊహకు అందక పుస్తకం మూసేసి, పొలానికి వెళ్ళిపోయాడు. ఆయన అలా వెళ్ళగానే స్వామి ఆయన వేషంలోనే వచ్చి, ఆ మిగిలిన పద్య భాగాన్ని పూర్తిచేశాడు. ఆ చివరిలోనే 'విహ్వల నాగేంద్రంబు పాహియన కుయ్యాలించి సంరంభియై' అని వస్తుంది. ఇంతలో పొలంలో వున్న పోతనగారికి ఇదే భావన స్ఫురించడం, ఆయన గబగబా వచ్చి చూస్తే, అప్పటికే ఆ పద్యం స్వామిచేత వ్రాయబడి ఉండటం జరిగిపోతుంది.

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

మానవుడు ఈ శరీరాన్ని పట్టుకుని నేను పుట్టేవాడిని, మరణించేవాడిని, లేకపోతే నాకు ఇంత వయస్సు, అంత వయస్సు అని ప్రేలాడుతున్నాడు. మానవుడిలో వున్న ఆ శక్తికి పుట్టుకలేదు, వృద్ధాప్యం లేదు. అది అక్షరః అంటే (క్షరం లేనిది) నిత్యమైనది. ఈ శరీర మనో బుద్ధులు వాని వెనుక వుండి, అన్ని అనుభవములను తెలియజేయు చైతన్య శక్తియే అక్షరము.

అంతటితో వూరుకోలేదు. దాన్ని ఏమన్నారు? 'పరమస్వరాట్' అని అన్నారు. పరమమైనది అంటే దాన్ని మించినది ఇంకొకటి లేదు. ఆ పరమాత్మ సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఎంత సూక్ష్మము అంటే నా గురుదేవుడు ప్రసాదించిన అనుభూతి కంటే సూక్ష్మమైనది మరొకటి లేదు. ఎంత పెద్దది అంటే ఆ అనుభూతికంటే పెద్దది ఇంకొకటి లేదు. పరమము అంటే సనాతనమైనది. ఎప్పటి నుండో వున్నది అవధులు లేవు దానికి. అది 'తానే.' ఈ జీవితమున్నంత వరకు వున్నది ఆ గురుదేవులే. అందుకని పరమ స్వరాట్ అన్నారు. ఇక్కడ సమష్టి తత్వాన్ని ప్రస్తావించారు. మనం మహాత్ముల సన్నిధిలో 'వ్యష్టి', 'సమష్టి' అనే పదాలను, తత్వాలను విని వున్నాము. వ్యష్టి అంటే వ్యక్తి. వాసనలచే ప్రేరితమై, అంతఃకరణ ద్వారా వ్యక్తమయ్యే ఆత్మ 'సామ్రాట్'. స్థూలమైన సమస్త నామ రూపాత్మక జగత్తు ద్వారా వ్యక్తమయ్యే ఆత్మ. 'విరాట్' వ్యష్టిలో నుంచి సమష్టిలోకి తీసుకు వెడుతున్నారు. ఎవరైనా మరణిస్తే అందరికీ సమారాధాన చేస్తాం. అంటే భోజనాలు పెడతాం. ఎందుకూ అంటే అందరూ స్వీకరిస్తే వారి ద్వారా మరణించిన ఆ జీవికి ఆ ప్రసాదం చెందుతుంది అనే గొప్ప భావన. కానీ అంతటితో సరిపోదు. నీలో రాగద్వేషాలు గుణాలు, తత్వదృష్టితో చింతన చేస్తూ రహితం చేసుకోవాలి. అందరిలో వున్న తత్వంతో ఏకాకారమవ్వాలి. ఇది సమష్టిదృష్టి. శాశ్వత సుఖాన్ని అందరమూ కోరుకుంటాము. దానికి అడ్డుగా వచ్చే గుణాలు రహితం చేసుకుంటేగాని, ఆ శాశ్వత సుఖాన్ని పొందలేము, సమష్టి తత్వానికి రాలేము. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్క పదార్థంలోను అంతరాత్మగా వుండి వ్యవహరించే అక్షరమైన ఆ పరమాత్మను 'స్వరాట్' అని అన్నారు. స్వరాట్ అంటే స్వయం

ప్రకాశకమైనది అని అర్థం. అది ప్రకాశింపజేయుటకు తనకంటే వేరైనది ఏదీ లేదు.

ఈ సమిష్టి తత్వాన్ని, దాని మహిమను తెలియజెప్పటానికి 'విరాట్', 'సామ్రాట్', 'స్వరాట్' అనే మూడు పదాలు ఉపయోగించారు. ఆత్మ యొక్క విరాట్ స్వరూపాన్ని గురించి వివరిస్తూ శ్రీమాతాజీ ఇలా అన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ తన విరాట్ స్వరూపాన్ని అర్జునుడికి చూపించారు. అర్జునుడు ఆ స్వరూపాన్ని విడిగా వుండి దర్శిస్తున్నట్లుగా మనకి చూపిస్తారు. దానివల్ల విరాట్ స్వరూపానికి భంగం ఏర్పడుతుంది. అర్జునుడు కూడా ఆ స్వరూపంలోనే వుండి దర్శించాడు. అంటే తనని తాను దర్శించేటట్లు (ఆ పాదాలలో తాను ఒకడై చూశాడు) చేశాడు కృష్ణపరమాత్మ. తద్వారా తాను (పరమాత్మ) అర్జునుడి కంటే విడిగా లేను అని నిరూపించాడు.

మనమందరం కూడా ఆ విరాట్ స్వరూపంలోనే, కైవల్యంలోనే వున్నాము. ఇది అనాదిగా వుంది. మనమేమీ సృష్టించింది కాదు. మనకి ఆశ్రయమిచ్చిన గురువు, గురుపదములు విరాట్ స్వరూపం. గురువు ఆ విరాట్ స్వరూపంలోనే వుంటూ, మనని కూడా ఆ స్వరూపంలోనే చూస్తూ, మనని అనుగ్రహిస్తున్నారు. మనం కూడా ఆ స్వరూపంలోనే వుండి ఆ అనుగ్రహాన్ని పొందుతున్నాము. మనం ఇంకా ఆ స్థితికి, అంటే ఇంకా ఆ విరాట్ తత్వాన్ని అనుభవించే స్థితికి రాలేదని వారి ఆవేదన. ఈ విధంగా వివరిస్తూ శ్రీ మాతాజీ 'బ్రహ్మజ్ఞానికి ఒకదాని పైనే ఆశ' అనే కీర్తనను ఆలపించారు.

-సశేషం

మనం క్రిందికి పడుతూవుంటే మన నీడ ఇంకా పెద్దదవుతూ వుంటుంది. అదే మనం పైకి ఎగిరితే మన నీడ ఇంకా ఇంకా చిన్నదై, చివరికి మాయమైపోతుంది. అలాగే మనం ఆధ్యాత్మికంగా దిగజారటం మొదలు పెడితే మన అజ్ఞానం ఇంకా ఇంకా పెరుగుతుంది. అదే మనం కొంచెం కష్టపడైనా పైకి ఎదగటం మొదలు పెడితే అజ్ఞానం మెల్లమెల్లగా చిన్నదై, చివరికి పూర్తిగా నశిస్తుంది. - మధుప

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బొంబాయి శాస్త్రిగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

శ్రీ బాబు శాస్త్రిగారింట్లో అందరితోనూ ఎంతో సరదాగా వుండేవారు. ఒకరోజు ఉదయం 7గంటలకు శాస్త్రిగారి పెద్ద కోడలు గాయత్రి దొడ్లో పనిచేసుకుంటూ ఉండగా, ఎవరో వచ్చినట్లు అలికిడైంది. ఆమె లోపలికి వచ్చి చూస్తే ఎవరూ కనబడలేదు. గదిలో పక్కమీద ఎవరో ముసుగు కప్పుకుని కూర్చున్నట్లు గమనించి ఆమె దగ్గరకు వెళ్ళే సరికి, లోపలి నుండి ఎవరో తొంగి చూసి మళ్ళీ కప్పేసుకున్నారు. అనుమానం వచ్చి ఆమె "ఎవరు?" అని గద్దించే సరికి "తోడుదొంగలం!" అంటూ శ్రీబాబు ముసుగు తీశారు. శాస్త్రిగారిని, అన్నపూర్ణమ్మగారిని ముసుగులో చెరొక ప్రక్క దగ్గరకు లాక్కొని కూర్చోబెట్టుకుని ఉన్న శ్రీ బాబుని చూసి, గాయత్రి "దొంగలం అనే సరికి భయపడ్డాను బాబూ!" అంది. "భయం లేదులే . దొంగలమే గాని నీ సత్త్వ రజ, స్తమో గుణాలను మూడింటిని అపహరించి సత్యము, శివము, సుందరములుగా మార్చే తోడు దొంగలము" అన్నారు శ్రీ బాబు. శాస్త్రిగారు నవ్వుతూ కూర్చున్నారు. అన్నపూర్ణమ్మగారు సిగ్గుతో ముడుచుకు పోయారు.



ఆశ్రమంలో ఉన్నపుడే శాస్త్రిగారు ఐక్య రాజ సమితి అమెరికా నుండి ఉద్యోగమిస్తామని ఉత్తరం వచ్చింది. కాని శాస్త్రిగారు దానిని పట్టించుకోలేదు. శ్రీ బాబుకు యీ విషయం తెలిసి "శాస్త్రిగారూ! అదేమిటి? అంత గొప్ప సంస్థ వారు మీకు ఉద్యోగమిస్తానంటే ఊరుకున్నారేమిటి? ఎన్నెన్నో దేశాలు చూడవచ్చు. విమానాలలో ఖండఖండాంతరాలు తిరుగవచ్చును. ఎందరెందరో ప్రపంచ నాయకులతో పరిచయాలు ఏర్పర్చుకోవచ్చు కదా! ఎంత హోదా ! ఎంత పలుకబడి! అన్నారు.

శాస్త్రిగారు "నిజమే కాని, బాబూ? అవన్నీ అనుభవిస్తున్నా యిక్కడ యిప్పుడు నేను పొందుతున్న యీ ప్రశాంతి, తృప్తి, ఆనందము నాకు

వాటిలో లభిస్తాయంటారా? అన్నిటిని మించి యిలా పదే పదే మీ దర్శనం పొందకుండా నేను ఉండలేను” అన్నారు. శ్రీ బాబు శాస్త్రిగారిని ఆలింగనం చేసుకుని “శభాష్! శాస్త్రిగారూ! ఇది మీకు భగవానుడు పెట్టిన పరీక్ష, మహా మాయ మీకొక ‘ఎర’ వేసి మీరు లోబడతారేమో అని చూసింది. కాని మీరు ఆ మాయలో పడక నిలిచి విజయం సాధించారు. ఇక మీకు ఢోకా లేద”న్నారు.

ఒకప్పుడు శాస్త్రిగారికి ప్రొస్టేట్ గ్రంథి ఆపరేషన్ చేయవలసి వచ్చింది. శాస్త్రిగారు భయపడి చేయించుకోనన్నారు. శ్రీ బాబు, శాస్త్రిగారితో “మీరు భయపడకుండా ఆపరేషన్ చేయించుకోండి. ఆ సమయంలో నేను మీ దగ్గరనే ఉండి ఆపరేషన్ చేయిస్తాను” అన్నారు. శాస్త్రిగారు అంగీకరించారు. కాని ఆపరేషన్ చేసే ముందు రోజునే శ్రీ బాబు పనిమీద ఏదో ఊరు వెళ్ళిపోయారు. శాస్త్రిగారికి ఆపరేషన్ జరిగింది. జరుగుతున్నంత సేపూ శ్రీబాబు చతుర్భుజులై శ్రీ మహావిష్ణువు రూపంలో దర్శనమిస్తూ తమ ప్రక్కనే ఉన్నట్లు శాస్త్రిగారు అనుభూతి పొందుతూనే ఉన్నారు.

ఆ తరువాత జరిగిన దసరా పూజలలో ఒకనాటి సత్సంగ సమావేశంలో శ్రీ బొంబాయి శాస్త్రి గారితో “శాస్త్రిగారూ! మీకు ఆపరేషన్ జరిగే సమయంలో నేను మీ దగ్గరే ఉండి ఆపరేషన్ చేయిస్తానని మాట యిచ్చాను కదూ! కాని ఆ సమయానికి ఊళ్ళో లేకుండా వెళ్ళిపోయాను. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయానే అని చాలా బాధ పడుతున్నాను” అన్నారు. శాస్త్రిగారు “మీరు మాట తప్పటమేమిటి బాబూ? నా ఆపరేషన్ జరిగినంత సేపూ మీరు నా దగ్గరనే ఉన్నారు గదా!” అన్నారు. శ్రీ బాబు “మీరు ఎవరిని చూశారో గాని, నేను ఆపరేషన్ సమయంలో ఊళ్ళోనే లేను గదా” అన్నారు. శాస్త్రిగారు “మీరు ఊళ్ళో ఉన్నారో లేదో నాకు తెలియదు గాని, నా ఆపరేషన్ సమయంలో మాత్రం మీరు నా ప్రక్కనే ఉండి ఒకసారి చతుర్భుజుడైన శ్రీ మహావిష్ణువు రూపంలోను మళ్ళీ మీ యీ రూపంలోను నాకు చిరునవ్వుతో దర్శనమిచ్చి అభయమిస్తూనే ఉన్నారు. మిమ్మల్ని అలా చూస్తున్న సంతోషంలో ఆపరేషన్ ఎలా జరిగిందో ఏం జరిగిందో కూడా నేను పట్టించుకోలేదు” అన్నారు.

- సశేషం

-రమణ ప్రసాద్

విష్ణు  కథలు

# శ్రీ శంకర భగవత్పాదులు

**శంకరుని జననం :**

శంకరుడు క్రీ.శ. 788లో జన్మించి క్రీ.శ. 820 నిర్యాణం చెందాడని చెబుతారు. శంకరుని తండ్రి శివగురుడు, తల్లి ఆర్యాంబ. వారిది నంబూద్రి బ్రాహ్మణ వంశం. చాలా కాలం వారికి సంతానం కలగలేదు. శైవ క్షేత్రాలెన్నో దర్శించారు. పూజలు చేశారు. త్రిచూరులోని శివాలయంలో కొన్ని నెలలు శివునికి పూజలు చేశారు. ఒకనాటి రాత్రి శివగురుని కలలో శివుడు ప్రత్యక్షమై "పూర్ణాయుర్దాయం గల ఎక్కువమంది పుత్రులు కావాలా? లేక అల్పాయుష్కుడు, అసాధారణుడు అయిన ఒక్క పుత్రుడు కావాలా?" అని అడిగాడు. శివగురుడు అల్పాయుష్కుడైనా, అసాధారణ ప్రతిభ గల పుత్రుడను ఈయమని కోరుకున్నాడు. శివుడు తానే స్వయంగా వారికి పుత్రుడుగా జన్మిస్తానని వరం ఇచ్చి అంతర్ధానమయ్యాడు.



ఆర్యాంబ గర్భం దాల్చి నవమాసాలు నిండిన తరువాత ఒక పుత్రుడిని కన్నది. అతడికి శంకరుడని నామకరణం చేశారు. అసాధారణ ప్రతిభతో పుట్టాడు. ఏడాది వయస్సులో మాతృభాష వ్రాయటం నేర్చాడు. రెండేళ్ళకే వ్రాయటం చదవటం నేర్చాడు. మూడవ ఏట కావ్యాలు, పురాణాలు అర్థం చేసుకునే జ్ఞానం సంపాదించాడు. ఉపనయనం కాకముందే తండ్రి చనిపోయాడు. ఐదవ ఏట ఉపనయనం జరిగింది. తర్వాత గురుకులంలో వేదవేదాంగాలు, వివిధ దర్శనాలు, శాస్త్రాలు అధ్యయనం చేశాడు.

గురుకులంలో ఉన్న రోజులలో ఒకనాడు శంకరుడు ఒక పేదవారింటికి "భిక్షాందేహి!" అంటూ వెళ్ళాడు. ఆ గృహిణి ఇంట్లో ఏమీ లేక ఒక మూల కనపడిన ఉసిరిక పండును బిక్షా పాత్రలో వేసింది. ఆమె దారిద్ర దైన్యాన్ని గ్రహించిన శంకరుడు లక్ష్మీస్తోత్రం చేశాడు. కనకధారా స్తోత్రంగా ప్రసిద్ధికెక్కింది ఆ స్తోత్రం.

అంగంహరేః పులకభూషణ మాశ్రయంతీ భృంగాంగనేవ
ముకులాభరణం తమాలం।

అంగీకృతాఖిల విభూతిరపాంగ లీలా మాంగల్యదాస్తు

మమ మంగళ దేవతాయాః ॥

అన్న శ్లోకంతో ప్రారంభమవుతుంది. ఈ స్తోత్రం పూర్తి అయ్యేసరికి ఆ పేదరాలి గృహం బంగారపు ఉసిరిక పండ్లతో నిండిపోయింది.

ఎనిమిదేళ్ళకే శంకరుడు వేద వాఙ్మయం, తర్కం, సాంఖ్యం, యోగం, మీమాంస మొదలైన శాస్త్రాలు ఆపోసన పట్టేసాడు. ఆ తరువాత మొసలి పట్టుకోవటం, సన్యాసదీక్ష తీసుకోవటం జరిగింది.

**ఉత్తరదేశ యాత్ర :**

ఇంటినుండి ఉత్తరాభిముఖంగా సాగిపోయిన శంకరుడు కొండలు, కోనలు దాటి నర్మదా నదీ తీరం చేరాడు. అక్కడ ఒక కొండ గుహలో గోవింద భగవత్పాదుడు శిష్య సమేతుడై నివసిస్తున్నాడు. గోవింద భగవత్పాదుడు మాండూక్యోపనిషత్తుకు కారికలు రచించిన విశ్వ విఖ్యాతుడైన గౌడపాదాచార్యుని శిష్యుడు. ఆయనను శంకరుడు సమీపించి తనను శిష్యునిగా స్వీకరించమని కోరాడు.

-సశేషం



17-9-2019 నుండి పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న హరేరామనామ సప్తాహ సత్సంగ ప్రారంభ దృశ్యం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD